ఈవార్తలు
వచ్చేశాం
ఈవార్తలు యాప్‌తో..
GET IT ON Google Play

PRGI REGD NO: TGTEL/25/A1385
నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ

బుధవారం WEDNESDAY 30-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 93 Issue: 93

30 సెప్టెంబర్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:02 తిథి చవితి మ. 2:54 వరకు తరువాత పంచమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం భరణి ఉ. 7:35 వరకు తరువాత రోహిణి యోగం వజ్ర రా. 12:15ం వరకు కరణం భాలవ మ. 2:54 వరకు కౌలవ రా. 1:45ం వరకు వర్జ్యం సా. 6:49 నుండి రా. 8:19 వరకు దుర్ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:29 వరకు రాహుకాలం మ. 12:06 నుండి మ. 1:35 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:07 వరకు గుళికాకాలం ఉ. 10:37 నుండి మ. 12:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు తె. 3:46 నుండి తె. 5:16 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



# ఉగ్రవాదంపై రెడ్ లైన్

## ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

### మా ఆందోళనలు గుర్తించకపోతే బంధానికి బీటలు

### అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం

న్యూయార్క్: భారత్–అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే తరువాయి 2 వ పేజీలో...

# ఆర్నెల్లు రేషన్ తీసుకోకపోతే కార్డు కట్



## అక్టోబర్ 1 నుంచే తాత్కాలిక నిలిపివేత

### కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. అర్హత నిరూపనకు 3 నెలల గడువు

రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా బోగస్, అనర్హులైన లబ్ధిదారుల ఏరివేత ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా వరుసగా గత ఆరు నెలలుగా ఎటువంటి రేషన్ సరుకులు తీసుకోని రేషన్ కార్డులను అక్టోబర్ 1వ తేదీ నుంచి తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా దాదాపు 1.58 కోట్ల రేషన్ కార్డులు హోల్డ్‌లోకి వెళ్లనున్నాయి. అయితే, ఆరు నెలలుగా సరుకులు తీసుకోనంత మాత్రాన ఆ కార్డులను ప్రభుత్వం డేటాబేస్ నుంచి శాశ్వతంగా రద్దు చేయడం లేదు.

న్యూఢిల్లీ: దీర్ఘకాలంగా రేషన్ తీసుకోనివారి కార్డులను తొలుత 'ఇన్‌యాక్టివ్' లేదా 'డిసేబుల్' చేస్తారు. బయోమెట్రిక్ సీడింగ్, ఆధార్ అనుసంధానం, ఈ–కేవైసీ ద్వారా ఇప్పటికే సుమారు 5.8 కోట్ల నకిలీ కార్డులను కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ తొలగించిన సంగతి తెలిసిందే. మిగిలిన వ్యవస్థలోనూ పారదర్శకత పెంచేందుకే ఈ నయా రూల్‌ను అమల్లోకి తెస్తున్నారు. కార్డులు నిలిచిపోయిన లబ్ధిదారులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వారు నిజమైన పేద లబ్ధిదారులే అయితే, ఆ విషయాన్ని రుజువు చేసుకునేందుకు మూడు నెలల సమయం ఇస్తున్నారు. ఈ 3 నెలల వ్యవధిలో స్థానిక అధికారుల ద్వారా క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేసుకోవాలి. సంబంధిత పీడీఎస్ కేంద్రం లేదా మీసేవ కేంద్రాల ద్వారా ఈ–కేవైసీ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. వివరాలు ధ్రువీకరణ పూర్తయిన వెంటనే సదరు రేషన్ కార్డు తరువాయి 2 వ పేజీలో...



# పాలపిట్టలను బంధిస్తే కఠిన చర్యలు

### అటవీశాఖ హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): దసరా పండుగ సందర్భంగా పాలపిట్టలను పట్టుకుని పంజరాల్లో బంధించడం, ప్రదర్శించడం వంటి చర్యలను ఉపేక్షించేది లేదని, ఇలాంటి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీ దళాల అధిపతి (హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్) వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నిన్న తరువాయి 2 వ పేజీలో...

# టీఎస్ఎల్పీఆర్బీకి జాతీయ అవార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డు (టీఎస్ఎల్పీ ఆర్బీ) ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం దక్కింది. పోలీస్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్‌ను సమర్థంగా అమలు చేసినందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార

తరువాయి 2 వ పేజీలో...



# కాళేశ్వరం పనులకు ఆర్మీ సేవలు

## ఎస్ఎల్‌బీసీ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పునరుద్ధరిస్తాం

### జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం.. ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ భేటీలో ఉత్తమ్

న్యూఢిల్లీ: కల్నల్ పరీక్షిత్ మెహ్రా సేవలతో నీటిపారుదల శాఖలో మంచి ఫలితాలు చూశామని.. ఆ అనుభవంతోనే ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పునరుద్ధరణ పనులకు ఆర్మీ ఇంజినీర్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు నీటిపారు దల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆర్మీ ఇంజినీర్ల రాకతో పనుల్లో నాణ్యత, వేగం, భద్రత మరింత పెరుగుతా య్నారు. న్యూఢిల్లీలో మంగళవారం ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ అయ్యారు. ఆర్మీ ఇంజినీర్ల ప్రతిపాదనపై ఆర్మీ చీఫ్ అంగీకరించారని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పునరుద్ధరణ పనులకు ఆర్మీ ఇంజినీర్ల తరువాయి 2 వ పేజీలో...





# పెట్రోల్ బంకుల్లో నీళ్ల బాటిళ్లు

### ఇండియన్ ఆయిల్ సొంత బ్రాండ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 43,603 పెట్రోల్ బంకుల్లో సొంత బ్రాండ్‌తో ప్యాకేజ్డ్ తాగునీటి బాటిళ్లను విక్రయించాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్ణయించింది. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ, రాష్ట్ర రహదారులపై ఉన్న 21,435 బంకుల్లో తొలి ప్రాధాన్యంగా వీటిని ప్రవేశపెట్టనున్నారు. నాన్–ఫ్యూయల్ వ్యాపారాన్ని విస్తరిస్తూ వార్షిక ఆదాయాన్ని రూ. 200 కోట్ల నుంచి రూ. 760 కోట్లకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రారంభంలో 250ఎంఎల్, 500ఎంఎల్, 1 లీటర్ సైజుల్లో అందుబాటులోకి తరువాయి 2 వ పేజీలో...

# సీఈసీ నిర్ణయాలపై విచారణ

### అంగీకారం తెలిపిన సుప్రీంకోర్టు





న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఎన్నికల సంఘం పనితీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. స్పందించిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను వచ్చే వారం విచారిస్తామని స్పష్టం చేసింది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో పలు కీలక అంశాలను

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,268 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,390 |

## విశ్వవాణి



రక్తగ్రూప్ 'బీ' ఉన్నవారిలో టైప్-2 మధుమేహం వచ్చే ముప్పు ఇతర రక్తగ్రూపులతో పోలిస్తే స్వల్పంగా ఎక్కువగా ఉండొచ్చని పలు పరిశోధనల సమీక్షలో తేలింది. వివిధ అధ్యయనాల సమాచారాన్ని విశ్లేషించిన పరిశోధకులు ఈ పెరుగుదలను సుమారు 28 శాతంగా అంచనా వేశారు. అయితే రక్తగ్రూప్ 'బీ' వల్లే మధుమేహం వస్తుందని దీని అర్థం కాదు. రక్తగ్రూపులకు సంబంధించిన ప్రత్యేక పదార్థాలు శరీరంలోని వాపు, రోగనిరోధక వ్యవస్థ సంకేతాలు, పేగుల్లోని సూక్ష్మజీవుల సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. ఇవి ఇన్సులిన్ పనితీరు, రక్తంలోని చక్కెర నియంత్రణతో సంబంధం కలిగి ఉంటాయి. అయితే టైప్-2 మధుమేహానికి ప్రధాన కారణాలు ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, నిద్ర, కుటుంబ చరిత్ర వంటి అంశాలేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రక్తగ్రూప్ 'బీ' ఒక అదనపు ప్రమాద సూచికగా ఉండొచ్చని మాత్రమే ఈ పరిశోధన పేర్కొంది.

# నీది చేతగానితనం

## నేను ఆధారాలతో మాట్లాడ్తా

### నాతో పెట్టుకుంటే మంచిగుండదు.. కేటీఆర్‌కు కవిత వార్నింగ్



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే పార్టీ నష్టపోయిందని అనడం మీ చేతగానితనానికి నిదర్శనమని, గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పెద్దాయన్నే తప్పు పడుతున్నావని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఫైరయ్యారు. అలా మీరు బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం పార్టీ వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. మూడేండ్లుగా కేసీఆర్ బయటకు రాకున్నా ఆయనకు ప్రజల్లో అభిమానం తగ్గలేదన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానమేంటో అర్థమైతుందా? అని ఎద్దేవా చేశారు. ఈమేరకు మంగళవారం ఆమె ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'నేను మీ పార్టీలో ఒక్క అవినీతి గుంటనక్కను విమర్శిస్తేనే.. కొన్ని గంటల్లో పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేశారు. అదే గుంటనక్కతో తరువాయి 2 వ పేజీలో...



# ఆడోళ్లతో కొట్టిస్తా

### ఇప్పటికైనా నోరు దగ్గర పెట్టుకోవాలి.. కొండా సురేఖ మాస్ వార్నింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): ఊడిపోయే పదవుల్ల ఉన్నోళ్లు తమ ముందు కుప్పిగంతులేస్తే ఊకోమని.. వాళ్లను ఆడోళ్లతోటే కొట్టిస్తామని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మావోళ్ల మీద ఈగ వాలినా మంచిగుండదన్నారు. మిమ్మల్ని కొట్టనీకి మొగోళ్లే అవసరం లేదని.. నా ఎన్కన్న ఆడోళ్లే సాలన్నారు. ఇప్పటికైనా నోరు దగ్గెర వెట్టుకోకుంటే ఎక్కడ దొర్కితే అక్కడ్నే కొడ్తారని హెచ్చరించారు. వరంగల్‌లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్ల అన్ని స్థానాలల్ల గెల్వాలని సూచించారు. రెండ్రోజులైతే ఊశిపోయేటోళ్లు (ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య) ఒకలున్నరు. నిన్నగాక మొన్న ఎక్కినోళ్లు (కుడా ఛైర్మెన్ గుండు సుధారాణి) ఒకలున్నరు. నిన్నగాక మొన్న ఎక్కినోళ్లు తరువాయి 2 వ పేజీలో...





# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ కొరడా

### ఏఐ సాయంతో స్పామర్ల గుర్తింపు

తొలిసారి పట్టుబడితే 15 రోజులు కాల్స్ నిలిపివేత

పదేపదే చేస్తే కొత్త కనెక్షన్ బంద్



# ఆ పోలీసులను గుర్తించండి

### మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తనపై హైకోర్టు ఆగ్రహం

# 2,935 మంది పోకిరీలకు బడితె పూజ

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఈవ్‌టీజింగ్, వేధింపులు తదితర కార్యకలాపాలకు పాల్పడిన 2,935 మందిని షీ టీమ్స్ అదుపులోకి తీసుకున్నాయి. ఈ నెల 14 నుంచి 26 వరకు జరిగిన ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్, బాలాపూర్‌తో పాటు గణేశ్ మంటపాల వద్ద షీ టీమ్స్‌ను భారీగా మోహరించారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్, అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు ప్రధాన గణేశ్ మంటపాలు, రద్దీ ప్రాంతాలు, నిమజ్జన మార్గాల్లో షీ టీమ్స్ నిరంతరం నిఘా వేశాయి. మహిళలు, యువతులపై వేధింపులను అరికట్టడమే లక్ష్యంగా ప్రత్యేక బృందాలు చురుగ్గా వ్యవహరించాయి. అదుపులోకి తీసుకున్న వారిలో 858 మందికి విచారణ అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించి వదిలిపెట్టారు. మరో 69 మందికి శిక్ష పడింది. వీరిలో 24 మందికి రూ. 1,050 జరిమానా తరువాయి 2 వ పేజీలో...



ఈవార్తలు

బుధవారం 30-9-2026, జగిత్యాల

## రాశి ఫలాలు

29.9.2026

మేషం: సన్నిహితులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు గతం కంటే పుంజుకుంటాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అధికారులతో చర్చలకు అనుకూల సమయం. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

వృషభం: సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారం అవుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది.

మిథునం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కర్కాటకం: కొన్ని వ్యవహారాలలో శిరో బాధలు తప్పవు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగమున స్థానచలన సూచనలు ఉన్నవి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి.

సింహం: గృహమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యపరుస్తాయి. నూతన వ్యక్తుల పరిచయం ఉత్సాహాన్నిస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

కన్య: నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనులు వ్యయ ప్రయాసలతో గాని పూర్తి కావు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగాలలో బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో సరైన సమయానికి నిర్ణయాలు తీసుకోక నష్టాలు ఎదుర్కొంటారు.

తుల: వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. ఇంటా బయట సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. కీలక సమయంలో సన్నిహితులు సహాయం అందిస్తారు.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో కొద్దిపాటి వివాదాలు తప్పవు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటాబయట చికాకులు అధికమవుతాయి. స్వంత ఆలోచనలలో నిలకడ లోపిస్తుంది. వ్యాపారాలలో భాగస్వాములతో బేధాభిప్రాయాలు కలుగుతాయి.

ధనస్సు: ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సంఘంలో మరింత గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభాలను అందుకుంటారు. నూతన పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు.

మకరం: దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. రాజకీయ ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగమున మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. బంధు మిత్రులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

కుంభం: దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు తప్పవు. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. ముఖ్యమైన పనులు కొన్ని వాయిదా వేస్తారు.

మీనం: ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. దీర్ఘకాలిక ఋణాలు తీర్చడానికి నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగస్తులకు ఆకస్మిక స్థానచలన సూచనలు తప్పవు. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో ఎంతగా కష్టపడ్డా ఫలితం ఉండదు.

# నీది చేతగానితనం

మొదటి పేజీ తరువాయి

అంటకాగుతున్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని.. వేరే లీడర్లు వేలు పెట్టొద్దని కేసీఆర్ అనడంతోనే పార్టీ నష్టపోయిందని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. మీరు మీ పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించడం.. ఆయన తీసుకున్న విధాన పరమైన నిర్ణయాలను బాహాటంగా తప్పు పట్టడం పార్టీ వ్యతిరేక చర్య కాదా? మీ ఫామ్‌హౌస్ లు, అక్రమంగా ఇచ్చిన పర్మిషన్లు, ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు, క్విడ్ ప్రో కో దందాలతో మీ పార్టీని పాతాళంలోకి నెట్టింది మీరు కాదా? నిన్నటి బీఆర్ఎస్ మీటింగులో ఓ రైతు ఫోన్ మాట్లాడుతుంటే "నీ పెండ్లామా? అంత అర్జెంటా? అని అహంకారంతో అతని భార్యనే అవమానించారు. "ఒక మహిళా సాయం కోరి వస్తే నా కోసం కన్నావా" అని అమ్మనే అవమానించారు. గుంటనక్క మైండ్ గేమ్‌లో బ్లైండ్‌గా పడిపోయి పెద్ద మనిషినే తప్పు బడుతున్నావ్. బీఆర్ఎస్‌కు గోతిని తవ్వుతున్నావ్. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు.. పార్టీలో మీ వైఫల్యాన్ని.. మీ చేతగాని తనాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపుతున్నావంటే.. ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానం ఏమిటో అర్థమవుతుందా? నిమజ్జనోత్సవంలో ఎంతమంది సోషల్ మీడియా



ఇన్‌ఫ్లూయెన్సర్లను బతిమాలుకున్నారో ఆ గణేష్ మహారాజుకు, మీ అంతరాత్మకు తెలుసు. బతిమాలి కేసీఆర్ పాటలు పెట్టిచ్చుకున్నరు. నేను నీలాగా విష నాగుల మాటలు విని మాట్లాడను. నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతా. నాతో పెట్టుకోకు' అని కేటీఆర్‌కు కవిత వార్నింగ్ ఇచ్చారు.



# ఆడోళ్లతో కొట్టిస్తా

మొదటి పేజీ తరువాయి

అసలైనోళ్లా.. లేక డూప్లికేటా మీరే ఆలోచించుకోర్రి. ఇంకోసారి మా ముందు కుప్పిగంతులేస్తే ఊర్కునేది లేదు. మిమ్ముల కొట్టనీకి మొగోళ్లు అవసరంలే.. ఆడోళ్లే కొడుతరు. నా ఎన్క నిలవడ్డోళ్లే సాలు.. ఒక్కొక్కళ్లు నలుగుర్ని కొడ్తరు. అంత దమ్ము, ధైర్యమున్నోళ్లు ఉన్నరు. నోరు జారీ పుసుక్కున ఎవర్నన్నా అంటే మాత్రం ఎక్కడ దొర్కితే అక్కడ్నే చిత్తు చిత్తు కొట్టి ఒదిలిపెడ్తరు. ఇప్పటికైనా నోరు దగ్గెరవెట్టుకొని ఉండుర్రి. ఇకముందు కొండా దంపతులకు చెందిన వ్యక్తుల మీద ఈగ వాలినా ఊర్కునేది లేదు' అని స్పష్టం చేశారు.

# ఆ పోలీసులను గుర్తించండి

## మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తనపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా



ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే.

# ఉగ్రవాదంపై రెడ్ లైన్

మొదటి పేజీ తరువాయి

ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# 2,935 మంది పోకిరీలకు బడితె పూజ

మొదటి పేజీ తరువాయి

విధించగా.. 40 మందికి సామాజిక సేవతోపాటు రూ.1,050 జరిమానా విధించారు. మరో ఐదుగురికి జరిమానాతోపాటు జైలు శిక్ష పడింది. ఉత్సవాల సమయంలో మహిళలు, యువతుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ఖైరతాబాద్, బాలాపూర్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్) ఎం శ్రీనివాస్ తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో వేధింపులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై షీ టీమ్స్ నిఘా వేశాయని వివరించారు.

# పెట్రోల్ బంకుల్లో నీళ్ల బాటిళ్లు

మొదటి పేజీ తరువాయి

తీసుకొచ్చి, భవిష్యత్తులో ప్రీమియం, ఆల్కలైన్ వాటర్‌ను కూడా తీసుకురానుంది. ఈ ప్రాజెక్ట్ కోసం మల్టీ-ఇయర్ అగ్రిగేటర్ ఆధారిత రెవెన్యూ షేరింగ్ విధానాన్ని ఐఓసీ ఎంచుకుంది. బ్రాండ్ యాజమాన్యం, ధరల నిర్ణయం, డీలర్ మార్జిన్లు పూర్తిగా ఇండియన్ ఆయిల్ వద్దే ఉంటాయి. అయితే బాటిళ్ల తయారీ, నాణ్యతా ప్రమాణాలు, సప్లై చైన్, లాజిస్టిక్స్ పర్యవేక్షణ వంటి బాధ్యతలను అర్హత కలిగిన సంస్థలకు అప్పగించనుంది.

# ఆర్నెల్లు రేషన్ తీసుకోకపోతే కార్డు కట్

మొదటి పేజీ తరువాయి

తిరిగి యాక్టివేట్ అవుతుంది. కొన్ని నెలలుగా వ్యక్తిగత కారణాలతో రేషన్ తీసుకోని కుటుంబాలు తక్షణమే తమ కార్డు స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో లేదా స్థానిక రేషన్ డీలర్ వద్ద చెక్ చేసుకోవడం ఉత్తమం. కార్డు తాత్కాలికంగా హోల్డ్‌లో పడితే కంగారు పడకుండా, సంబంధిత పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని సంప్రదించి అవసరమైన ఆధార్, ఈ-కేవైసీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పునరుద్ధరించుకోవచ్చు.

# పాలపిట్టలను బంధిస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాలపిట్టల సంరక్షణ, ప్రమాదకరమైన చైనా మాంజా నియంత్రణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ.. విజయదశమి రోజు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయం ఉందని, అయితే కొందరు ఇదే అదనుగా వాటిని పట్టుకుని పంజరాల్లో బంధించి ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల పక్షులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతాయని, ఆహారం తీసుకోక బలహీనపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది దసరా సమయంలో బంధించిన 28 పాలపిట్టలను స్వాధీనం చేసుకుని తిరిగి విడిచిపెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాలపిట్టలను బంధించడం వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం నేరమని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌కు విరాళాల జోరు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): అధికారంలో లేనప్పటికీ బీఆర్ఎస్‌కు విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం గమనార్హం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ.15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరిగింది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# టీఎస్ఎల్పీఆర్బీకి జాతీయ అవార్డు

మొదటి పేజీ తరువాయి

సంస్థ 'ఆధార్ సంవాద్-2026' జాతీయ అవార్డుతో టీఎస్ఎల్పీఆర్బీని సత్కరించింది. కోల్‌కతాలో మంగళవారం నిర్వహించిన 5వ జాతీయ భాగస్వాముల సదస్సులో కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హాజరైన కార్యక్రమంలో టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు. పోలీస్ ఉద్యోగ నియామకాల్లో ఇతరుల పేర్లతో హాజరయ్యే నకిలీ అభ్యర్థులను (ఇంపర్సనేషన్) అరికట్టేందుకు టీఎస్ఎల్పీఆర్బీ ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు విధానాన్ని ప్రవేశపెట్టింది. యూఐడీఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ మార్గదర్శకత్వంలో తొలిసారిగా ఆఫ్‌లైన్ ఆధార్ ఫేస్ అథెంటికేషన్ విధానాన్ని అమలు చేసింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఈ సాంకేతికతను విజయవంతంగా వినియోగించిన తొలి నియామక సంస్థగా రికార్డు సృష్టించింది. గత ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు తొలి విడత దరఖాస్తుల స్వీకరణలో భాగంగా అభ్యర్థులు తమ మొబైల్ ఫోన్లలో ఆధార్ యాప్ ద్వారా ముఖ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తం దరఖాస్తుదారుల్లో 98.7 శాతం మంది.. అంటే 4,23,348 మంది ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. మిగిలిన 1.3 శాతం మంది 5,652 మందికి యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయ సమన్వయంతో సాంకేతిక సహాయం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# బీఆర్ఏఓయూలో ఆన్‌లైన్ కోర్సులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. బికామ్ (తెలుగు), బీకాం (ఇంగ్లీష్), ఎంకామ్ (ఇంగ్లీష్), ఎంఏ తెలుగు, ఎంబీఏ (ఇంగ్లీష్) కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చు అని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు, నమోదు, ట్యూషన్ ఫీజు చెల్లింపు తదితర వివరాలు వెబ్ సైట్ లో పొందోచ్చని సూచించారు. దేశ, విదేశాల్లో నివసించే ఎన్నారై అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా పై కోర్సులలో చేరొచ్చని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా చెల్లించవచ్చు అని వెల్లడించారు.




# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ కొరడా

**ఏఐ సాయంతో స్పామర్ల గుర్తింపు**

**తొలిసారి పట్టుబడితే 15 రోజులు కాల్స్ నిలిపివేత**

**పదేపదే చేస్తే కొత్త కనెక్షన్ బంద్**

న్యూఢిల్లీ: అనవసర స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారులకు ఊరటనిచ్చేలా టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందకపోయినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత సాయంతో స్పామ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయాలని టెలికాం సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు 'టెలికం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్'లో నూతన నిబంధనలను పొందుపరిచింది. ఏఐ విశ్లేషణలో మొదటిసారి స్పామర్‌గా నిర్ధారణ అయితే, సదరు వ్యక్తి పేరిట ఉన్న అన్ని కనెక్షన్లపై 15 రోజుల పాటు అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేస్తారు. నిబంధనలను అతిక్రమిస్తూ మళ్లీ అదే తప్పు చేస్తే, ఆ నంబర్లను ఏడాది పాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతారు. అటువంటి వారికి ఏ టెలికాం సంస్థ కూడా కొత్త కనెక్షన్‌లను జారీ చేయదు.

# సీఈసీ నిర్ణయాలపై విచారణ

మొదటి పేజీ తరువాయి

లేవనెత్తారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బహుళ సభ్యులు ఉండే ఈ రాజ్యాంగ సంస్థలో ఏ నిర్ణయమైనా సమిష్టిగా, ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన మాత్రమే తీసుకోవాల్సి ఉందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. అయితే, సీఈసీ మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలు, ఫారమ్-6 మార్పులను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే సీఈసీ ఒంటెద్దు పోకడతో తీసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సీఈసీ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలన్నింటినీ చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు.

# కాళేశ్వరం పనులకు ఆర్మీ సేవలు

మొదటి పేజీ తరువాయి

సేవలు అవసరం. ముగ్గురు ఆర్మీ అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు ఆర్మీ ప్రధాన కార్యాలయం ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లను పంపింది. ఒక ఆర్మీ అధికారిని ఎస్ఎల్బీసీ సొరంగ పనుల పర్యవేక్షణకు నియమించే ప్రయత్నం చేస్తున్నాం. మరో ఇద్దరు అధికారులను మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు నియమించాలని నిర్ణయించాం. ఆర్మీ ఇంజినీర్ల రాకతో పనుల్లో నాణ్యత, వేగం, భద్రత మరింత పెరుగుతాయి. ఆర్మీ అధికారుల సాంకేతిక నైపుణ్యం, క్రమశిక్షణను కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఉపయోగించుకుంటాం. లెఫ్టినెంట్ కల్నల్ సత్యదేవ్ సింగ్, రంజిత్ ఏ.మీనన్, హెచ్.వి. భల్లా పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ పనుల పర్యవేక్షణకు ఆర్మీ అధికారుల అనుభవం వినియోగించుకుంటాం. ఎస్ఎల్బీసీ సొరంగానికి రెండు వైపులా జరుగుతున్న తవ్వకాలను ఆర్మీ అధికారి పర్యవేక్షిస్తారు. సొరంగం లోపలి పనులు, వెంటిలేషన్, భద్రతా ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. 44 కిలోమీటర్ల ఎస్ఎల్బీసీ సొరంగంలో ఇప్పటికే దాదాపు 35 కిలోమీటర్ల పని పూర్తి అయింది. 2028, జూన్ నాటికి ఎస్ఎల్బీసీ సొరంగాన్ని పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను శాస్త్రీయంగా పునరుద్ధరిస్తాం. మూడు బరాజ్‌ల మట్టి, కాంక్రీట్, పునాదుల పరీక్షలు తుది దశకు చేరుకున్నాయి. ఐఐటీ బాంబే, ఏఎఫ్ఆర్‌వై ఇండియా నిపుణులు పరీక్షల ఫలితాలను విశ్లేషిస్తున్నారు. బరాజ్‌ల పునరుద్ధరణకు నిపుణుల బృందాలు తుది డిజైన్లు సిద్ధం చేస్తున్నాయి. ఆర్మీ అధికారుల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయి సమన్వయం, జవాబుదారీతనం మరింత బలోపేతం కానుంది. పనుల వేగం కోసం భద్రత, నాణ్యత, ఇంజినీరింగ్ ప్రమాణాల విషయంలో రాజీపడబోం. ఎస్ఎల్బీసీని గడువులోగా పూర్తి చేసి మూడు బరాజ్‌లను పూర్తి భద్రతతో వినియోగంలోకి తీసుకొస్తాం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఖైరతాబాద్ కారు సీట్లో.. మన్నే గోవర్ధన్ రెడ్డి!

పార్టీకి కట్టు బానిస..
పట్టుసడలని వ్యక్తిత్వం..
అధిష్ఠానానికి ఆత్మబంధువు..
మాటిస్తే మడమ తిప్పని మనస్తత్వం..
ఇదీ యువ కెరటం..
మన్నే గోవర్ధన్ రెడ్డి నైజం!
"కేసీఆర్ మాట జవదాటని నేత..
ప్రజా సేవలో తిరుగులేని తపన.."



## పోటీకి సై అంటున్న యంగ్ లీడర్.. దశాబ్దాలుగా గులాబీ గూటిలోనే

**2018, 2023లో పార్టీ నిర్ణయానికి బద్ధుడు**

**ఉపఎన్నికలో పార్టీ టికెట్‌పై గంపెడాశలు**

**ప్రజలతో మమేకం.. సమస్యలపై పాదయాత్రలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): ఖైరతాబాద్ ఉపఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై ఆసక్తి నెలకొంది. పార్టీ నుంచి పలువురు నేతల పేర్లు పరిశీలనలో ఉండగా.. సుదీర్ఘకాలంగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న మన్నే గోవర్ధన్ రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. 2014లో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గోవర్ధన్ రెడ్డి.. ఆ తర్వాత కూడా పార్టీకి వీరవిధేయుడిగా ఉన్నారు. 2018, 2023 ఎన్నికల్లో దానం నాగేందర్‌కు పార్టీ అవకాశం కల్పించినప్పుడు అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించి పనిచేశారు. తాజాగా ఉపఎన్నిక నేపథ్యంలో తనకు అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకత్వాన్ని ఆయన కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమ కాలం నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్న మన్నే గోవర్ధన్ రెడ్డి 2005లో అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు. 2014 ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేశారు. అనంతరం బీఆర్ఎస్‌లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాల్లో కొనసాగారు. ప్రస్తుతం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. 2014లో తనకు అవకాశం లభించినప్పటికీ.. ఆ తర్వాతి రెండు ఎన్నికల్లో దానం నాగేందర్‌కు పార్టీ టికెట్ ఇవ్వడంతో గోవర్ధన్ రెడ్డి పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మరో పార్టీలోకి వెళ్లకుండా బీఆర్ఎస్‌లోనే కొనసాగారు. 2018, 2023 ఎన్నికల్లో దానం నాగేందర్‌కు అవకాశం ఇచ్చిన సందర్భాల్లో పార్టీ కోసం దేనికైనా రెడీ అని నిబద్ధత ప్రకటించారు. తదుపరి సందర్భాల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ గూటికి వెళ్లడం, వేటు పడటంతో మన్నే గోవర్ధన్ రెడ్డి పేరు మళ్లీ జోరుగా వినిపిస్తోంది. ఖైరతాబాద్ గడ్డతో తనకు ఉన్న ఆత్మీయ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, పోటీలో నిలిచేందుకు సై అంటున్నారు.

ప్రస్తుతం మన్నే గోవర్ధన్ రెడ్డితో పాటు విష్ణువర్ధన్ రెడ్డి, దాసోజు శ్రవణ్, తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరుల పేర్లు కూడా పార్టీ పరిశీలనలో ఉన్నా.. గోవర్ధన్ రెడ్డికే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సర్వేలు చెప్తున్నాయి.

టికెట్‌తో సంబంధం లేకుండా ఖైరతాబాద్‌లో స్థానిక సమస్యలపై గోవర్ధన్ రెడ్డి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు 'సమస్యలపై సమరం' పేరుతో పాదయాత్రలు నిర్వహించి, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలోనూ ఆయన నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ బీఆర్ఎస్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ప్రజాసమస్యలపై గళమెత్తుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగడుతున్నారు.

**కుటుంబానికీ రాజకీయ అనుబంధం**

గోవర్ధన్ రెడ్డి భార్య మన్నే కవిత కూడా ఖైరతాబాద్ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నారు. బంజారాహిల్స్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ డివిజన్ (డివిజన్ నం.92)కు కార్పొరేటర్‌గా సేవలు అందించారు. గులాబీ జెండాను ఇంటింటికీ తీసుకెళ్తూ.. ప్రజలకు దగ్గరయ్యారు. ముఖ్యంగా కేటీఆర్ యువ నాయకత్వంలో దంపతులిద్దరూ బీఆర్ఎస్‌కు కట్టుబానిసల్లా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మన్నే గోవర్ధన్ రెడ్డి పేరును మరోసారి ఖైరతాబాద్ టికెట్ చర్చలోకి తీసుకొచ్చాయి.

## ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హుల పేర్లేవి?

కొడిమ్యాల, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాల్లో నిజమైన నిరుపేదల పేర్లు నమోదు కాలేదని పలువురు అర్హులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారు ఎంపీడీవోను కలిసి వివరణ కోరగా, ఇందిరమ్మ ఇళ్ల వెబ్‌సైట్ ప్రస్తుతం అందుబాటులో లేదని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. నిజమైన అర్హులను గుర్తించి వారికి వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని అర్హులు ఎమ్మెల్యేను కోరారు.



## అసలైన ఓటు చోరీ కాంగ్రెస్సే: యాదగిరిబాబు

జగిత్యాల, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ పార్టీ బీజేపీపై దుష్ప్రచారం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు విమర్శించారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, మైనారిటీలు, రిజర్వేషన్లు ప్రమాదంలో ఉన్నాయంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం కలిసి ఓట్లను తొలగిస్తున్నాయన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

## జగిత్యాల జేఎన్టీయూను వర్సిటీ చేయాలి: జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): జగిత్యాల జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఉత్తర తెలంగాణ విద్యార్థులకు అధునాతన సాంకేతిక కోర్సులు, పరిశోధన, ప్రయోగశాలలు, నూతన ఆవిష్కరణల కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావడానికి



కళాశాలను విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేయాలని కోరారు. వెనుకబడిన జగిత్యాల ప్రాంతంలో సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కళాశాల మంజూరైందని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి శివారులో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆధునిక భవనాలతో కళాశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ కోర్సులతో పాటు ఈసెట్, పీజీ కోర్సుల్లో ఏటా సుమారు 1,500 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు.

## అభివృద్ధి, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

**జగిత్యాల మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానాలు**



జగిత్యాల, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్య సేవలు, ప్రజా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తెలిపారు. ఆమె అధ్యక్షతన మంగళవారం జగిత్యాల పురపాలక సంఘ కార్యాలయంలో సెప్టెంబర్ నెల కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మృతి చెందిన మున్సిపల్ కార్మికులు చాంద్‌ఖాన్, కొండ్ర రవీందర్, రిటైర్డ్ ఉద్యోగి అవారి ఆనందం మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులకు రూ.50 లక్షలు కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాల పనులు, పారిశుద్ధ్య వాహనాల మరమ్మతుల కోసం రూ.4 లక్షలు కేటాయించాలని నిర్ణయించింది. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మునీరుద్దీన్, కమిషనర్ కె. సత్యప్రణవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా సుమారు 1,600 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో కళ్యాణలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సమావేశమయ్యారు. భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. బందోబస్తును 12 సెక్టార్లుగా విభజించినట్లు ఎస్పీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



## పోలీస్ స్టేషన్ పక్కనే కాపర్ వైర్ చోరీ

మల్యాల, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): మల్యాల సివిల్ ఆస్పత్రిలో కాపర్ వైర్ చోరీ కలకలం రేపింది. ఆస్పత్రిలోని బోర్‌కు సంబంధించిన సుమారు 80 మీటర్ల కాపర్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే చోరీ జరగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, నిఘా పరిస్థితిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బోర్ వైర్ చోరీ కారణంగా ఆస్పత్రి అవసరాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేసి చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు



## వృద్ధాశ్రమంలో అన్నదానం

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహిస్తున్న సేవా మాసంలో భాగంగా మంగళవారం గాంధీ ఆస్పత్రి సమీపంలోని వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వై. సురేష్ కుమార్ అధ్యక్షతన, జిల్లా ఇన్‌చార్జి సారంగపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉపాధ్యక్షులు శీలం శివలింగం, రాజేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## గోపన్నగారి గణేష్‌కు ముఖ్య అర్చకుడిగా పదోన్నతి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న గోపన్న గారి గణేష్‌కు ముఖ్య అర్చకుడిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్‌కుమార్, వేద పండితులు, ప్రధాన అర్చకులు, ఆలయ ఉద్యోగులు గణేష్‌ను అభినందించారు. స్వామివారి సేవలో ఆయన మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

## వినయ్ సాగర్‌కు కీలక బాధ్యతలు



గంగాధర, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండపల్లి గ్రామ సర్పంచ్ మల్యాల వినయ్ సాగర్ దళిత్ ప్రొటెక్షన్ ఫోర్స్ కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర దళిత్ ప్రొటెక్షన్ ఫోర్స్ వ్యవస్థాపకుడు ఎం. రమణ తెలిపారు. మాదరగోని ప్రసాద్ అధ్యక్షతన ఇటీవల నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో దళితుల భూములు, ఇళ్ల స్థలాలు, వివక్ష, దాడులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రమణ, ప్రసాద్, అఖిలేష్‌కుమార్, లక్ష్మణ్, రామ్‌మూర్తి, సురేష్, లింగన్న, కనుకరాజ్ తదితరులు పాల్గొన్నారు. వినయ్ సాగర్‌ను జిల్లా కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ ప్రకటించింది.

## అత్యుత్తమంగా రాజన్న ఆలయ అభివృద్ధి: పొన్నం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆయన ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయరమణారావు, వేముల వీరేశంతో కలిసి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా భక్తులు రాజన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. వేములవాడతో పాటు భద్రాద్రి, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం తదితర ప్రముఖ ఆలయాల్లోనూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధి



కోసం గతంలో జరిగిన పోరాటాలు, భక్తుల ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవిస్తోందని చెప్పారు.

## బీర్‌పూర్‌లో కంక బొంగుల అక్రమ నిల్వలు

బీర్పూర్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రం పరిధిలో కంక బొంగుల నిల్వలు, విక్రయాలపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని ఓ వ్యక్తి అనుమతులు లేకుండా కంక బొంగులను నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో అధికారులు పరిశీలన చేపట్టారు. రాయికల్ మండలం దావన్‌పెల్లి-కట్కాపూర్ అటవీ ప్రాంతం నుంచి కూలీల ద్వారా బొంగులను తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. బీర్‌పూర్, తుంగూర్ గ్రామాల్లో బొంగులను నిల్వ చేసి ఒక్కొక్కటి రూ.50 నుంచి



రూ.60 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. నెలకు సుమారు పది ట్రాక్టర్ల బొంగులను తరలించి జగిత్యాల, ధర్మపురి ప్రాంతాల్లో నూతన గృహ నిర్మాణాలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బొంగుల విక్రయాలకు సంబంధించి మండలంలో ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ధర్మపురి ఎఫ్ఆర్‌వో శ్రీనాథ్ తెలిపారు. బీర్‌పూర్‌లో సిబ్బంది సుమారు 250 బొంగులను లెక్కించినట్లు చెప్పారు. తుంగూర్‌లో కూడా మరో డంప్ ఉన్నట్లు సమాచారం ఉందని, దీనిపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): బాలానగర్ డివిజన్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోను తండ్రి మహమ్మద్ మక్బూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేశారు. ఈ మేరకు రూ.3 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీ మంజూరైంది. చెక్కును బండి రమేష్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎజాజ్, రంగారావు, శివ, రమణ, నరేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.





## కొండగట్టు అంజన్న సేవలో వీహెచ్

మల్యాల, సెప్టెంబర్ 29(ఈవార్తలు): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వీహెచ్ హనుమంతరావు మంగళవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అంజన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించిన హనుమంతరావు, కొండగట్టు క్షేత్ర విశిష్టతను తెలుసుకున్నారు.

## సిరిసిల్లకు ఇచ్చే నిధులెన్ని?

**ఆరోపణలు కాదు.. ఆధారాలేవి?**

**సీఎంపై బీఆర్ఎస్ నేతల విమర్శలు**

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 29 (ఈవార్తలు): సిరిసిల్ల పట్టణంలో బుధవారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటన సందర్భంగా తమ ప్రాంతానికి ఏ మేరకు నిధులు కేటాయిస్తారో ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. గతంలో శాసనసభ వేదికగా ప్రతి పక్షంపై చేసిన 8 వేల ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా ఆరోప ణలకు ఆధారాలు చూపించి శ్వేత పత్రం విడు దల చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ పాల నలో సిరిసిల్ల నియోజ కవర్గాన్ని నాటి మంత్రి కేటీఆర్ నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు రూ.400 కోట్లు, మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.166 కోట్లు, అగ్రికల్చర్ కళాశాలకు రూ.90 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. మౌలిక వసతులు, రహదారుల విస్తరణకు కూడా నిధులు



తీసుకొచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రామతీర్థపు రాజు, గూడూరి మధు, నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, మారం కుమార్, సుంకపాక రాజు, సిరిగిరి చందు, కొండ కనకయ్య, వాసాల శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల మాట విన్నారు..
సమస్యను గుర్తించారు..
అధికారులను కదిలించారు..
పరిష్కారాన్ని చూపించారు..
ఇది కదా ప్రజలు కోరుకునే ఆలన..
ఇదే కదా అమ్మలాంటి పాలన..!
అంతటి గొప్ప పాలన అందించారు..
"జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్
(రెవెన్యూ) బీఎస్ లత"

అది 1987 మే 16.. ప్రభుత్వ పాలనలో ఒక కొత్త శకం మొదలైంది. అప్పుడు మొదలైన కర్తవ్య పథం.. నేటి వరకు నిరంతరాయంగా, నిర్విఘ్నంగా, నిబద్ధతతో, నిజాయితీతో, నిరాడంబరంగా, నిస్వార్థంగా, క్రమశిక్షణతో, కర్తవ్య నిష్టతో, ఆప్యాయంగా, ఆదరణగా సాగింది. దాదాపు నాలుగు దశాబ్దాల ఉద్యోగ ప్రస్థానంలో ఆమెకు ప్రజలే కేంద్రం.. ప్రజాసేవే లక్ష్యం. సుదీర్ఘ ప్రభుత్వ సేవలో తనదైన గుర్తింపు పొందిన జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్ లత.. ఉద్యోగ ప్రస్థానం 2026 సెప్టెంబర్ 30న పదవీ విరమణతో ముగియనుంది.



# ఆమె పాలన.. అమ్మలా ఆలన!

## ……ఆదర్శంగా బీఎస్ లత సేవా ప్రస్థానం……

### బాల్యం నుంచి అదనపు కలెక్టర్ వరకు ఎన్నెన్నో ఘనతలు
### తహసీల్దార్, భూసేకరణ అధికారిణిగా పురస్కారాలు
### జగిత్యాలలో ఆత్మీయ పరిపాలన.. నేడు పదవీ విరమణ

## ప్రజాసేవలో చెరగని అడుగులు

**1965** సెప్టెంబర్ 14న హనుమకొండలో బీఎస్ లత జన్మించారు. ఆమె తండ్రి భాస్కరరావు ఉపాధ్యాయుడు. ఆయన నుంచి క్రమశిక్షణ, నిజాయితీ, విద్య పట్ల గౌరవాన్ని అలవర్చుకున్నారు. తల్లి సుశీల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, జిల్లా అధికారిణిగా సేవలందించారు. మహిళలు, చిన్నారుల పట్ల తల్లికి ఉన్న శ్రద్ధ లతలో ప్రజాసేవ పట్ల ఆసక్తిని పెంచింది. విద్య, సేవ, బాధ్యతలకు ప్రాధాన్యం ఇచ్చే కుటుంబ వాతావరణం ఆమె వ్యక్తిత్వానికి పునాది వేసింది. ఆమె సోదరుడు సుధాకర్‌రావు గ్రూప్–1 అధికారిగా, మరో సోదరుడు రవికిరణ్ వైద్యుడిగా సేవలందిస్తున్నారు. సోదరి శశికళారాణి ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వేర్వేరు రంగాల్లో కుటుంబ సభ్యులు అందిస్తున్న సేవలు ఆమె పెరిగిన వాతావరణాన్ని ప్రతిబింబిస్తాయి.

### చదువు.. ప్రజా పరిపాలనపై ఆసక్తి

హనుమకొండలో విద్యాభ్యాసం చేసిన లత పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంఏ పూర్తి చేశారు. ప్రజా పరిపాలనను ఒక విద్యాంశంగా చదవడమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాగల బాధ్యతగా అర్థం చేసుకున్నారు. చదువుతో పొందిన అవగాహనను తరువాత క్షేత్రస్థాయి పరిపాలనలో ఉపయోగించారు. 1987 మే 16న ప్రభుత్వ సేవలో అడుగుపెట్టారు. వరంగల్ ఎక్సైజ్ శాఖలో ప్రారంభమైన ఆమె ఉద్యోగ జీవితం తరువాత జిల్లా పరిపాలన వైపు మలుపు తిరిగింది. 1995లో ఏపీపీఎస్సీ గ్రూప్–2 ద్వారా డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికై, రెవెన్యూ శాఖలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు.

### మండలాల్లో ప్రజలకు అందుబాటులో..

పరకాల, ఖానాపూర్, వర్ధన్నపేట, ఆత్మకూరు, కోనిజర్ల, రాయపర్తి, బచ్చన్నపేట తదితర ప్రాంతాల్లో పనిచేసిన లతకు ప్రజల సమస్యలపై ప్రత్యక్ష అవగాహన ఏర్పడింది. భూమి, జీవనోపాధి, సంక్షేమం, ధ్రువపత్రాలు వంటి అంశాలను కేవలం కార్యాలయ దరఖాస్తులుగా చూడకుండా, వాటితో ముడిపడిన కుటుంబ అవసరాలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. బచ్చన్నపేటలో పనిచేసిన కాలంలో ఒకే మండలంలో సుమారు పది వేల మంది పేద రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు జారీ చేయడం, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చూపిన చొరవ ఆమె సేవా ప్రస్థానంలో ప్రత్యేకంగా నిలిచాయి. ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిశీలిస్తూ, ప్రజలకు ఉపయోగపడే పరిష్కారం కనుగొనడం ఆమె పని విధానంగా మారింది.

### భూసేకరణలో కీలక అధ్యాయం

2014లో డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన లత, కరీంనగర్ జిల్లా మైనారిటీస్ వెల్ఫేర్ అధికారిణిగా పనిచేశారు. అనంతరం ఎస్ఆర్ఎస్పీ స్టేజ్–1, 2 భూసేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కీలక బాధ్యతలు చేపట్టారు. భూసేకరణలో ప్రభుత్వ అభివృద్ధి అవసరాలతో పాటు భూములు ఇచ్చే రైతు కుటుంబాల పరిస్థితినీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాల మధ్య చట్టబద్ధమైన, న్యాయమైన సమతుల్యత సాధించేందుకు ఆమె కృషి చేశారు. ఐదు వేల ఎకరాలకు పైగా భూసేకరణ ప్రక్రియను ఆరు నెలల వ్యవధిలో అప్పటి జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పూర్తి చేయడంలో భాగస్వాములయ్యారు. రైతులు, భూ యజమానులు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చేస్తూ సమస్యలను పరిష్కరించారు. ఈ సేవలకు గుర్తింపుగా 2016లో అప్పటి జిల్లా కలెక్టర్ వి. కరుణ, అప్పటి ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ డిప్యూటీ కలెక్టర్ పురస్కారం అందుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఆమె పనితీరు ప్రత్యేక ప్రశంసలు పొందింది.

### మెదక్ నుంచి హెచ్ఎండీఏ వరకు

2017లో మెదక్ జిల్లా రెవెన్యూ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తించారు. అదే సంవత్సరం డిసెంబరులో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో 'మెంబర్ ఎస్టేట్' పదవిలో చేరారు. అక్కడ స్పెషల్ కలెక్టర్, పీడీ–భూదాన్ వంటి బాధ్యతలను కూడా నిర్వహించారు. హెచ్ఎండీఏలో బహిరంగ ఆన్‌లైన్ వేలం ప్రక్రియను పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించడంలో ఆమె పాత్రకు ప్రభుత్వ ప్రశంసలు లభించాయి. ఆమె పనితీరును అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రశంసించారు. మండల స్థాయి రెవెన్యూ పని నుంచి పట్టణాభివృద్ధి సంస్థ వరకు భిన్నమైన బాధ్యతల్లో ఆమె పనిచేసిన అనుభవానికి ఇది మరో అధ్యాయంగా నిలిచింది.

### నిజామాబాద్‌లో 563 గ్రామాలకు మౌలిక వసతులు

2020 ఫిబ్రవరిలో నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలోని 563 గ్రామ పంచాయతీల్లో డంప్ యార్డులు, నర్సరీలు, శ్మశానవాటికలు, ఇతర గ్రామస్థాయి కనీస మౌలిక వసతులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి ఒక ఆర్థిక సంవత్సరంలో పనులు పూర్తి చేయించారు. రాష్ట్రంలో నిజామాబాద్, సిద్ధిపేట జిల్లాలు మాత్రమే ఆ స్థాయిలో లక్ష్యాన్ని సాధించాయి. పనుల వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ బృందం క్షేత్రస్థాయిలో ఫలితాలను చూసి ప్రశంసించింది. ప్రణాళిక, అమలు, నాణ్యత, అధికారుల మధ్య సమన్వయంతో గ్రామాలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ఆమె నాయకత్వం కీలకంగా నిలిచింది.

### ఉత్తమ తహసీల్దార్‌గా గుర్తింపు

**2001లో తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన అనంతరం ఖానాపూర్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. అక్కడ ప్రజలకు అందుబాటులో ఉంటూ దరఖాస్తులను ఆలస్యం చేయకుండా పరిశీలించడం, రెవెన్యూ పరిపాలనలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా గుర్తింపు పొందారు. ఆమె పనితీరుకు గుర్తింపుగా 2004లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్ పురస్కారం అందుకున్నారు. అదే సంవత్సరంలో ఒక స్వచ్ఛంద సంస్థ కూడా ఆమెను ఉత్తమ తహసీల్దార్‌గా సత్కరించింది. అనంతరం 2008లో వర్ధన్నపేట మండలంలో గృహ నిర్మాణ పథకం అమలులో చొరవ చూపారు. పథకం ప్రయోజనం అర్హులైన కుటుంబాలకు చేరేలా చూడడంపై దృష్టి పెట్టారు.**

### జగిత్యాలతో ప్రత్యేక అనుబంధం

2021 జూన్ 28న జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా లత బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత ఈ జిల్లాతో ఆమెకు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. 2022 నుంచి 2024 మధ్య అప్పటి జిల్లా కలెక్టర్లు రవి నాయక్, యాస్మిన్ బాషా ఆధ్వర్యంలో భూ రికార్డుల ప్రక్షాళన, ధాన్యం కొనుగోళ్లు, ఎన్నికల నిర్వహణ వంటి పనుల్లో భాగస్వాములయ్యారు. 2024 ఫిబ్రవరి వరకు జగిత్యాలలో పనిచేసిన తరువాత సూర్యాపేట జిల్లాకు వెళ్లారు. అక్కడ లోక్‌సభ ఎన్నికలు, ధాన్యం సేకరణ, ఇతర పరిపాలనా పనుల్లో సుమారు ఎనిమిది నెలలు సేవలందించారు. 2024 అక్టోబర్ 30న తిరిగి జగిత్యాలకు వచ్చి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు చేపట్టారు. రైతు పండించిన పంటకు తగిన గౌరవం దక్కాలంటే కొనుగోలు ప్రక్రియలో ప్రతి దశ సజావుగా సాగాలని లత భావించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ సంచుల సరఫరా, ధాన్యం రవాణా, మిల్లులకు తరలింపు, రైతులకు చెల్లింపుల వరకు సంబంధిత శాఖలతో సమన్వయం చేశారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లలో ఎదురైన ఆటంకాలను పరిష్కరించేందుకు కృషి చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులకు 48 గంటల్లో నగదు చెల్లింపులు జరిగేలా పర్యవేక్షించారు. కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే రైతు వెనుక ఒక కుటుంబం ఉంటుందనే విషయాన్ని ఆమె ఎప్పుడూ గుర్తుంచుకునేవారని సహచరులు చెబుతారు.




### క్లిష్ట సమస్యలకు పరిష్కార మార్గం

భూ సమస్యల్లో పాత రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు, కుటుంబాల అభ్యంతరాలు, వివిధ శాఖల సమాచారం కలిసి ఉంటాయి. అటువంటి అంశాల్లో పూర్తి వివరాలు తెలుసుకుని, అధికారులతో చర్చించి, చట్ట పరిధిలో నిర్ణయం తీసుకోవడాన్ని లత అనుసరించారు. అనేక శాఖల సమన్వయం అవసరమైనప్పుడు అందరినీ ఒకచోట చేర్చి సమస్యను ముందుకు తీసుకెళ్లేవారు. పనిలో క్రమశిక్షణ పాటిస్తూనే ఉద్యోగులు, సహచరులతో ఆత్మీయంగా వ్యవహరించారు. అందుకే జగిత్యాల కలెక్టరేట్‌లో ఆమెను పలువురు 'అమ్మలాంటి పరిపాలన' అందించిన అధికారిణిగా గుర్తుచేసుకుంటారు. ఓటరు నమోదు, ఎన్నికల నిర్వహణలోనూ ఆమె పనితీరుకు ఉన్నతాధికారుల ప్రశంసలు లభించాయి. లత భర్త గాబ్రియేల్ జైళ్ల శాఖలో పనిచేసి పదవీ విరమణ చేశారు. పెద్ద కుమారుడు మదన్ కుమార్, పెద్ద కోడలు వెంకట రమణి అమెరికాలో స్థిరపడ్డారు. వెంకట రమణి ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు విజయ్ కుమార్ లండన్‌లో విద్యనభ్యసించి ఫైనాన్స్ రంగంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చిన్న కోడలు గీత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. లతకు నలుగురు మనవలు ఉన్నారు. కుటుంబ సభ్యుల సహకారం తన సుదీర్ఘ ఉద్యోగ ప్రయాణానికి బలంగా నిలిచింది.

పదవీ విరమణతో ముగియని గుర్తింపు

1987 మే 16 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు సాగిన ఆమె సేవా ప్రస్థానంలో ఎన్నో పదవులు, బదిలీలు, బాధ్యతలు ఉన్నాయి. ఉత్తమ తహసీల్దార్, ఉత్తమ డిప్యూటీ కలెక్టర్ పురస్కారాలు అధికారిక గుర్తింపులు. భూములు ఇచ్చిన రైతులతో సాధించిన సమన్వయం, గ్రామాలకు కల్పించిన సదుపాయాలు, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అందించిన సహకారం, జగిత్యాలలో సహచరులతో ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధం ఆమె సేవలకు ప్రజల్లో మిగిలే గుర్తింపులు. సెప్టెంబర్ 30న బీఎస్ లత పదవీ విరమణ చేయనున్నారు. హనుమకొండలో బాల్యంతో మొదలై, వివిధ జిల్లాల మీదుగా జగిత్యాల వరకు సాగిన ఆమె ప్రయాణం ప్రజల పట్ల బాధ్యత, పనిపట్ల నిబద్ధతతో గుర్తుండిపోతుంది.



"పదవులు ఎన్నో..
బాధ్యతలు ఇంకెన్నో..
కానీ ప్రజలకు అందుబాటులో ఉండటమే..
ఆమెకు అసలైన బాధ్యత."

-----

"ఒక సమస్య ఆమె దగ్గరకు వస్తే..
అది ఫైల్‌గా మారేది కాదు..
పరిష్కారం కోసం ప్రయాణం మొదలయ్యేది."

----

**కృతజ్ఞతలతో..
జగిత్యాల జిల్లా
పరిపాలన యంత్రాంగం**

మనం తాగే ప్రతి ఛాయ్ ఒకేలా ఉండదు. ఒక్కో ఛాయ్‌కు ఒక్కో తీరు ఉంటుంది. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రుచి ఉంటుంది. తేయాకు పెరిగిన నేల, అక్కడి వాతావరణం, ఆకుల నాణ్యత, వాటిని సేకరించే విధానం, తయారీ పద్ధతి.. అన్నీ కలిసి ఆ ఛాయ్‌కు ఓ ప్రత్యేకమైన రుచిని, పరిమళాన్ని అందిస్తాయి. మనకు మాత్రం చేతిలో ఉన్న కప్పే కనిపిస్తుంది. కానీ ఆ కప్పులోకి చేరే ముందు.. దాని వెనుక ఓ సుదీర్ఘ ప్రయాణం ఉంటుంది. కొండల మధ్య పచ్చగా పరుచుకున్న తేయాకు తోటలు.. తెల్లవారుజామునే ఆకులు సేకరించే కార్మికుల శ్రమ.. కర్మాగారాల్లో జరిగే ప్రక్రియ.. నాణ్యత పరీక్షలు.. వేల కిలోమీటర్ల ప్రయాణం.. చివరకు మన చేతిలోకి వచ్చే ఆ పది రూపాయల ఛాయ్ కప్పు. అంటే.. మనం తాగేది కేవలం ఛాయ్ కాదు. ఓ ప్రాంతపు నేల పరిమళాన్ని.. ఓ రైతు శ్రమను.. ఓ కార్మికుడి చెమటను.. ఓ పరిశ్రమ ప్రయాణాన్ని కూడా ఆస్వాదిస్తున్నామన్న మాట. ఈ విషయాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవాలంటే.. భారతీయ తేయాకు రంగానికి కేంద్రబిందువుగా ఉన్న కలకత్తా టీ బోర్డును సందర్శించాల్సిందే. టీ బోర్డు కార్యాలయంలో అడుగుపెట్టినప్పుడు ప్రతిరోజున మనం సాధారణంగా చూసే ఛాయ్ వెనుక ఉన్న అసాధారణ ప్రపంచం కళ్లముందు ఆవిష్కృతమైంది. అక్కడ తెలిసిన మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. టీ అనేది ఒక్కటే కాదు. డార్జిలింగ్ టీకి ఓ ప్రత్యేకత ఉంటే.. అసోం టీకి మరో ప్రత్యేకత. నీలగిరి టీకి మరో రుచి, పరిమళం. తేయాకు పెరిగే ప్రాంతం మారితే.. దాని స్వభావం మారుతుంది. తయారీ విధానం మారితే.. కప్పులోని రుచి మారుతుంది. అందుకే టీని కేవలం 'ఛాయ్'గా చూడలేం. అది ఓ ప్రపంచం. ఓ పరిశ్రమ. లక్షలాది మంది జీవనాధారం. కోట్లాది రూపాయల వాణిజ్యం. మరెందరో టీ ప్రియులకు మాత్రం.. రోజును మొదలుపెట్టించే ఓ చిన్న ఆనందం.

*ఉదయం నిద్ర లేవగానే చేతిలోకి వచ్చే టీ కప్పు.. మన దైనందిన జీవితంలో ఎంతో సాధారణమైన పానీయం. కానీ ఆ చిన్న కప్పు వెనుక వేల సంఖ్యలో తేయాకు తోటలు, లక్షల మంది కార్మికుల శ్రమ, రైతుల ఆశలు, వ్యాపారుల కార్యకలాపాలు, నాణ్యత ప్రమాణాలు, దేశీయ మార్కెట్, అంతర్జాతీయ ఎగుమతులు.. ఇలా ఒక భారీ వ్యవస్థనే ఉంటుంది. ఆ వ్యవస్థకు దిశానిర్దేశం చేసే కీలక సంస్థ 'టీ బోర్డు ఇండియా'. మీడియా బృందం కోల్‌కతా పర్యటనలో భాగంగా అక్కడి టీ బోర్డు ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన తర్వాత గానీ ఛాయ్ గొప్పదనం, దాని వెనకున్న శ్రమ తెలియరాలేదు. ఆ ఇంట్రెస్టింగ్ అంశాలు మీ కోసం ప్రత్యేకంగా..*

*(ఈవార్తలు - ఎడిటర్స్ నోట్)*



## ఛాయ్ గొప్పదనం చెప్పాలనుంది..

రూ.10 ఛాయ్‌కే అంత బిల్డప్పా? అని అడగకండి.
ఛాయ్ తాగుతూ ముచ్చట్లు చెప్పాలనుంది..
రెండు, మూడు సిప్పులకే సోది అవసరమా అనకండి.

## ఛాయ్ చరిత్ర ప్రపంచానికి చెప్పాలనుంది..

రోజూ తాగుతున్నదే కదా అని తీసిపారేయకండి.
ఛాయ్ గురించి మెగాస్టార్ ఎప్పుడో చెప్పారని అనకండి..
అంతకుమించిన ఇంట్రెస్టింగ్ అంశాలు ఉన్నాయోయ్..!



# టీ తోటలపై ఇస్రో ఐ

## కృత్రిమ మేధతో తేయాకు రంగంలో కొత్త విప్లవం

**కప్పులోకి వచ్చే టీ వెనుక ఓ మహా వ్యవస్థ.. తేయాకు రంగానికి దిక్సూచి కోల్‌కతా టీ బోర్డు**

**టీ మార్క్.. డిజిటల్ ట్రేసబిలిటీ.. ఆన్‌లైన్ మార్కెట్.. భవిష్యత్ టీకి కోల్‌కతా నుంచే బాట**

## టీజీ మీడియా బృందం టీ బోర్డు సందర్శన

### శతాబ్దానికి పైబడిన ప్రస్థానం

భారతదేశంలో తేయాకు రంగానికి ప్రభుత్వ స్థాయిలో ప్రోత్సాహం కల్పించే ప్రయత్నాలకు 1903లోనే బీజం పడింది. అప్పట్లో భారత తేయాకు ఎగుమతులపై సుంకం విధించి, ఆ నిధులను దేశీయంగా, విదేశాల్లో భారతీయ తేయాకు ప్రోత్సాహానికి వినియోగించే విధంగా చర్యలు చేపట్టారు. అనంతరం 1953లో తేయాకు చట్టం వచ్చింది. ఆ చట్టంలోని 4వ సెక్షన్ ప్రకారం 1954 ఏప్రిల్ 1న ప్రస్తుత టీ బోర్డు ఏర్పాటైంది. అప్పటి నుంచి భారత తేయాకు పరిశ్రమ అభివృద్ధిలో టీ బోర్డు కీలక పాత్ర పోషిస్తోంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే చట్టబద్ధ సంస్థగా ఇది దేశ తేయాకు రంగం అభివృద్ధికి సంబంధించిన విస్తృత బాధ్యతలను నిర్వహిస్తోంది. తేయాకు సాగు, ఉత్పత్తి, మార్కెటింగ్ మాత్రమే కాదు.. పరిశ్రమకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయం అందించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, పరిశోధన-అభివృద్ధికి తోడ్పడటం, నాణ్యతను మెరుగుపరచడం, చిన్నతరహా తేయాకు సాగుదారులకు సహాయం చేయడం, తేయాకు రంగానికి సంబంధించిన గణాంకాలను సేకరించడం వంటి అనేక బాధ్యతలను టీ బోర్డు నిర్వర్తిస్తోంది. ఇది చూస్తే టీ బోర్డు కేవలం తేయాకు వ్యాపారానికి సంబంధించిన సంస్థ కాదని స్పష్టమవుతుంది. తోటలో మొక్క నాటినప్పటి నుంచి తేయాకు ప్రపంచ మార్కెట్‌కు చేరే వరకు అనేక దశల్లో ఈ వ్యవస్థకు సంబంధం ఉంది.

### 'డార్జిలింగ్ టీ'కి ప్రత్యేక గుర్తింపు

భారతీయ తేయాకు అంటే ముందుగా గుర్తుకు వచ్చేది డార్జిలింగ్, అసోం, నీలగిరి వంటి ప్రాంతాలు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రుచి, వాసన, రంగు, ప్రత్యేకత ఉంటుంది. టీ బోర్డు అధికారికంగా డార్జిలింగ్, అసోం, నీలగిరి, కాంగ్రా, దూర్స్-తెరాయ్, సిక్కిం తదితర తేయాకు ఉత్పత్తి ప్రాంతాలను గుర్తిస్తోంది. ప్రత్యేకించి డార్జిలింగ్ తేయాకు భారతదేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఉత్పత్తిగా నిలిచింది. హిమాలయాల ఒడిలోని తేయాకు తోటల నుంచి వచ్చే ఈ తేయాకు భారతీయ తేయాకు వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. తేయాకు పరిశ్రమ వెనుక ఉన్నది కేవలం వ్యాపారం కాదు.. వేల కుటుంబాల జీవనాధారం కూడా. తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలకు కూడా టీ బోర్డు పరిమిత స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తోంది. చిన్నతరహా తేయాకు సాగుదారులకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించడంపైనా దృష్టి సారిస్తోంది.



### ప్రపంచానికి భారతీయ టీ

భారతీయ తేయాకుకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లోనూ ప్రత్యేక స్థానం ఉంది. ఎగుమతుల ప్రోత్సాహం టీ బోర్డు ప్రధాన బాధ్యతల్లో ఒకటి. విదేశీ మార్కెట్లలో భారతీయ తేయాకు ప్రాచుర్యాన్ని పెంచడం, దిగుమతిదారులు-ఎగుమతిదారుల మధ్య అనుసంధానానికి సహకరించడం వంటి కార్యక్రమాలు కూడా చేపడుతోంది. కోల్‌కతాలోని ప్రధాన కార్యాలయంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో టీ బోర్డుకు ప్రాంతీయ, ఉపప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. ఉత్తర-తూర్పు ప్రాంతానికి గువాహటి, దక్షిణ భారతానికి కూనూర్‌లో మండల కార్యాలయాలు ఉన్నాయి. తేయాకు సాగు జరిగే వివిధ ప్రాంతాలకు చేరువగా సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది.

### ఇస్రోతో కలిసి తేయాకు తోటల పర్యవేక్షణ

2026, సెప్టెంబర్ 3న టీ బోర్డు ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ), ఎన్ఐటీ రూర్కెలాతో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. 'చాయాంకన్' పేరుతో కృత్రిమ మేధ, ఉపగ్రహ చిత్రాలు, భౌగోళిక సమాచార విశ్లేషణలను ఉపయోగించి తేయాకు తోటలను పర్యవేక్షించే పరిశోధన చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు 2026 ఏప్రిల్ నుంచి 2029 మార్చి వరకు అమలు చేయనున్నారు. తోటల విస్తీర్ణం, పంట పరిస్థితి, మార్పులు తదితర అంశాలను ఆధునిక సాంకేతికతతో విశ్లేషించే దిశగా అడుగు పడుతోంది.

### టీ మార్క్ - కల్తీకి చెక్

2026లో టీ బోర్డు 'టీ మార్క్' ధ్రువీకరణ పథకాన్ని ప్రారంభించింది. దేశీయ మార్కెట్లో విక్రయించే తేయాకుకు ధ్రువీకరణ, మూలం-నాణ్యతను గుర్తించే వ్యవస్థను తీసుకురావడమే దీని ఉద్దేశం. దీనికి అనుబంధంగా ఆన్‌లైన్ టీ మార్క్ లైసెన్సింగ్ పోర్టల్, 'టీ మార్కెట్‌ప్లేస్' పోర్టల్ కూడా ప్రారంభించారు. అంటే భవిష్యత్తులో వినియోగదారుడు కొనుగోలు చేసే టీకి అది ఎక్కడి నుంచి వచ్చింది? ఏ సంస్థ తయారు చేసింది? నాణ్యత ధ్రువీకరణ ఉందా? వంటి అంశాలను మరింత వ్యవస్థీకృతంగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. 2026 ఏప్రిల్ 30 నుంచి టీ దిగుమతులు, వాటి తిరిగి ఎగుమతుల కోసం వెబ్ ఆధారిత అత్యంత-ముగింపు ట్రేసబిలిటీ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అంటే టీ ఎక్కడి నుంచి వచ్చింది, దాని తదుపరి ప్రక్రియ ఏమిటి అనే సమాచారాన్ని డిజిటల్‌గా అనుసరించే వ్యవస్థను బోర్డు తీసుకొచ్చింది. టీ బోర్డు వెబ్ పోర్టల్, మొబైల్ అనువర్తనం ఆధారంగా సమగ్ర ఆన్‌లైన్ సేవల వేదిక రూపొందించే దిశగా చర్యలు చేపట్టింది. దీనిపై పరిశ్రమ వర్గాల నుంచి సూచనలు కూడా కోరింది. 2026లో టీ బోర్డు 100 శాతం డస్ట్ టీ వేలానికి సంబంధించిన ప్రామాణిక విధానాన్ని సవరించింది. అలాగే ప్రతి నమోదిత టీ తయారీదారు ఒక క్యాలెండర్ సంవత్సరంలో తయారు చేసే టీ మొత్తంలో కనీసం 50 శాతాన్ని భారతదేశంలోని బహిరంగ టీ వేలం ద్వారా విక్రయించే విధానంపై కూడా చర్యలు తీసుకుంది. డార్జిలింగ్ జీఐ పరిధిలోని తేయాకు విషయంలో పచ్చి ఆకుల సేకరణకు సంబంధించిన వివరాలను సమర్పించాల్సిన నిబంధనలను టీ బోర్డు 2026లో తీసుకొచ్చింది. అలాగే మూల వివరాలు లేకుండా మూల ధ్రువీకరణ పత్రాల జారీని నిలిపివేసింది.

### యువతకు కొత్త అవకాశాలు

యువతకు ఏయే అవకాశాలు కల్పిస్తున్నారు? ఏవైనా నైపుణ్య కోర్సులను అందుబాటులోకి తెచ్చారా? అని 'ఈవార్తలు' అడగ్గా.. జాతీయ వృత్తి విద్యా, శిక్షణ మండలి ఆమోదించిన రెండు నైపుణ్య కోర్సులను టీ బోర్డు ప్రారంభించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందులో 60 గంటల 'టీ సోమెలియర్' ప్రాథమిక కోర్సు ఉంది. తేయాకు రకాలను గుర్తించడం, రుచి-వాసనలను శాస్త్రీయంగా అంచనా వేయడం, నాణ్యత పరిశీలన, మిశ్రమ తేయాకు తయారీ, టీ వడ్డింపు విధానాలు వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. ఇక, టీ బోర్డు స్వయంగా ఈ కార్యక్రమం లక్ష్యాల్లో ఒకటిగా యువతలో తేయాకు పరిజ్ఞానాన్ని పెంచడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం అని వెల్లడించారు. అంటే టీ తోటల్లో సంప్రదాయ ఉద్యోగాలకు మాత్రమే కాకుండా నాణ్యత పరిశీలన, రుచి పరీక్ష, బ్రాండింగ్, మార్కెటింగ్ వంటి కొత్త రంగాల్లోనూ అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. 'టీ మార్క్' ధ్రువీకరణ వ్యవస్థ, 'టీ మార్కెట్‌ప్లేస్ (కియోస్క్ సెంటర్లు)' ఆన్‌లైన్ వేదికలను టీ బోర్డు 2026లో తీసుకొచ్చింది. ఇవి తేయాకు ఉత్పత్తిదారులు, విక్రయదారులు, కొనుగోలుదారులను అనుసంధానించే దిశలో ఉన్నాయి. దీనివల్ల కొత్త తరం వ్యాపారులు ప్రత్యేక టీ బ్రాండ్లు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆన్‌లైన్ విక్రయాలు వంటి రంగాల్లోకి రావడానికి అవకాశాలు ఏర్పడతాయని టీబోర్డు ప్రతినిధులు పేర్కొన్నారు.





(పీఐబీ-హైదరాబాద్, పీఐబీ-కోల్‌కతా సహకారంతో..)

## లవ్లీ చిత్రం










## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న
# ప్యారడైజ్ టీమ్

నాని హీరోగా నటించిన ది ప్యారడైజ్ సినిమా మంచి విజయం సాధించింది. మొదట సినిమాకు నెగిటివ్ టాక్ వచ్చినా మెల్లిమెల్లిగా అది కాస్తా పాజిటివ్ గా మారింది. ఇప్పటికే ఈ చిత్రానికి 150 కోట్లకు పైగా కలెక్షన్స్ వచ్చాయి. దీంతో చిత్రయూనిట్ మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంది. హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నటుడు సంపూర్ణేష్ బాబుతో పాటు పాటల రచయిత కాసర్ల శ్యామ్ నేడు మేడారం వెళ్లి అమ్మావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాని అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు. మేడారం సమ్మక్క సారక్కను దర్శించుకోవడంతో పాటు గోవిందరాజు, పగిడిద్ద రాజులను సైతం దర్శించుకున్నారు. అంతకంటే ముందు ములుగు జిల్లాలోనే ఉన్న శ్రీ గట్టమ్మ దేవస్థానాన్ని సైతం చిత్రయూనిట్ సందర్శించింది. ఇదిలా ఉంటే మేడారంతో ది ప్యారడైజ్ సినిమాకు ఓ కనెక్షన్ ఉంది. ఈ సినిమాకు మొదట సమ్మక్క అనే టైటిల్ నే అనుకున్నారు. సినిమాలో హీరో తల్లి పాత్రపేరు సమ్మక్క కావడం, ఆమె తమ జాతి హక్కుల కోసం పోరాటడం చేయడంతో మొదట అదే టైటిల్ ను పరిశీలించారు. కానీ తరవాత టిటిల్ మారుస్తూ ప్యారడైజ్ ను ఖరారు చేశారు. అయినప్పటికీ సినిమా కథలో సమ్మక్క అనే పాత్రకు ఎంతో ప్రధాన్యత ఉంటుంది. ఇక సినిమాకు భారీగా కలెక్షన్స్ రావడంతో చిత్రయూనిట్ అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంది.



# రణబీర్‌లో రాముడి రూపం చూస్తున్నా



భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ'. ప్రతిభావంతుడైన దర్శకుడు నితేష్ తివారీ ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, విఎఫ్ఎక్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ భారీ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తుండగా, రావణాసురుడిగా కన్నడ రాకింగ్ స్టార్ యష్ కనిపిస్తున్నారు. అలాగే హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్, శూర్పనఖగా రకుల్ ప్రీత్ సింగ్ అలరించనున్నారు. ఈ రామాయణ కథను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేశారు. అందులో మొదటి భాగం ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, జరిగిన ఓ ఈవెంట్‌లో సాయి పల్లవి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రణబీర్ కపూర్ శ్రీరాముడి గెటప్‌ను సెట్స్‌లో చూసినప్పుడు తనకు కలిగిన అనుభూతిని పంచుకుంది. చిన్నప్పటి నుంచి తన మనసులో శ్రీరాముడి రూపం ఎలా ఉండేదో, ఆ ముఖంలో కనిపించే అమాయకత్వం, ప్రశాంతత.. అవన్నీ సరిగ్గా రణబీర్ లుక్‌లో చూసి తను ఆశ్చర్యపోయానని చెప్పింది. తన చిన్ననాటి రాముడే నిజంగా వచ్చి కళ్లముందు నిలబడినట్లు అనిపించిందని సాయి పల్లవి చెప్పుకొచ్చింది.

## మీనాక్షికి..
## నాని కలిసి వచ్చేనా!

**ఏడాది ఎదురుచూపులకు తెర.. నానితో ఛాన్స్!**

నాని తన తదుపరి సినిమా 'బ్లడీ రోమియో' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులను వేగంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం అందుతోంది. చాలా కాలం క్రితం కలిసి వర్క్ చేయాల్సిన నాని, సుజీత్ ఫైనల్‌గా ఈ ఏడాది లో తమ కాంబో మూవీని పట్టాలెక్కించబోతున్నారు. ది ప్యారడైజ్ సినిమా కోసం కాస్త ఎక్కువ సమయం తీసుకున్న నాని తదుపరి సినిమాల విషయంలో జెట్ స్పీడ్ మెయింటెన్ చేయాలని భావిస్తున్నాడట. అందుకే సుజీత్‌కు ముందుగానే సినిమాను ఆరు నెలల లోపు పూర్తి చేయాలని చెప్పాడట. అందుకు తగ్గట్లుగా సుజీత్ ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. వచ్చే నెలలోనే షూటింగ్ ప్రారంభించి వచ్చే ఏడాది సమ్మర్ కి బ్లడీ రోమియోను విడుదల చేయబోతున్నారట. ఈ సినిమాలో మీనాక్షి నటిస్తోందట, చాలా కాలంగా చేతిలో సినిమాలు లేక ఇబ్బందులు పడుతున్న మీనాక్షి.. నానితో సినిమా తర్వాత మరిన్ని పెద్ద సినిమాలు చేయబోతుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది.



## మైసూరులో మధుర జ్ఞాపకాలు: రాశీ ఖన్నా

దేవాలయాల సందర్శన, స్నేహితులతో సరదాగా ఆటలు, మైసూర్ దోశ తింటూ ఎంజాయ్ చేసిన ఈ పిక్స్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. మైసూర్ అందాల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో గడుపుతున్న టాలెంటెడ్ బ్యూటీ రాశి ఖన్నా తాజాగా పంచుకున్న క్యూట్ పిక్స్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఉరుకులు పరుగుల సినిమా లైఫ్‌కి కాస్త బ్రేక్ ఇచ్చి, మైసూర్‌లో గడిపిన మధుర జ్ఞాపకాలను ఆమె ఫ్యాన్స్‌తో పంచుకుంది. దేవాలయాల సందర్శన, స్నేహితులతో సరదాగా ఆటలు, మైసూర్ దోశ తింటూ ఎంజాయ్ చేసిన ఈ పిక్స్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి.





## ఫరియా కష్టాలు తీరేనా!

జాతిరత్నాలు వచ్చిన టైమ్ గుర్తు చేసుకుంటే ఫరియా అబ్దుల్లా కెరీర్ ఇంకో రేంజ్‌లో వెళ్లాలి అనిపిస్తుంది. కరోనా భయం పూర్తిగా తగ్గని రోజుల్లో వచ్చిన ఆ సినిమా థియేటర్లకు జనాలను మళ్లీ తీసుకొచ్చిన హిట్స్‌లో ఒకటిగా నిలిచింది. చిట్టి పాత్రతో ఫరియా ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ ఐదేళ్లు దాటినా ఆ హిట్ తర్వాత ఆమె కెరీర్ అదే స్పీడ్‌లో వెళ్లలేకపోవడం మాత్రం కొంచెం ఆశ్చర్యమే. సిగ్మా ఆమెకు అందుకే ముఖ్యమైన సినిమా. సందీప్ కిషన్‌తో కలిసి పనిచేస్తున్న ఈ సినిమాలో రేడియో జాకీగా అన్ని రకాల ఎమోషన్స్ చూపించే పాత్ర చేశానని ఫరియానే చెప్పారు. అక్టోబర్ 2న సినిమా వస్తోంది. ఇది గట్టిగా క్లిక్ అయితే హైట్ గురించే మాట్లాడే వాళ్ల కంటే, ఆమెను ఎవరితో జోడీ చేయాలి అని ఆలోచించే నిర్మాతలు పెరగొచ్చు. ఫరియాకు ఇప్పుడు కావాల్సింది మరో ఫోటోషూట్ కాదు.. కాస్టింగ్ టేబుల్ మీద ఆమె పేరును పైకి తీసుకొచ్చే ఒక పెద్ద హిట్. సిగ్మా తమిళంలో కూడా ఆమెకు మొదటి పెద్ద రిలీజ్ అవుతోంది ఇప్పుడు. అందులోనూ విజయ్ కొడుకు దర్శకుడు. కాబట్టి ఏమవుతుందో చూడాలి.




## అది నా చిన్ననాటి కల

బాలీవుడ్ యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ శార్వరి వాఘ్ తన అందం, ప్రతిభతో వరుస అవకాశాలు అందుకుంటూ ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం ఈ అమ్మడు ప్రముఖ దిగ్గజ దర్శకుడు సూరజ్ బార్జాత్యా తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'యే ప్రేమ్ మోల్ లియా'లో నటిస్తోంది. ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాలో యంగ్ హీరో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా శార్వరి కనిపించనుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి విడుదలైన టైటిల్ సాంగ్ యూట్యూబ్‌లో బాగా ట్రెండ్ అవుతోంది. ఈ పాట లాంచ్ సందర్భంగా.. శార్వరి తన చిన్ననాటి ముచ్చట్లను పంచుకుంటూ ఎమోషనల్ అయింది. చిన్నతనంలో 'దిదీ తేరా దేవార్ దీవానా' పాటలో మాధురీ దీక్షిత్, 'మైయ్యా యశోదా' పాటలో కరిష్మా కపూర్, సోనాలీ బింద్రేలను చూస్తూ పెరిగానని శార్వరి తెలిపింది. ఆ ఐకానిక్ పాటలు చూసిన ప్రతిసారీ ఇంటికొచ్చి అద్దం ముందు నిలబడి డ్యాన్స్ చేస్తూ, తనను తాను తెరపై హీరోయిన్‌గా ఊహించుకునేదాన్ని అని చెప్పింది. ఆ పాతకాలపు క్లాసిక్ బాలీవుడ్ పాటల్లోని ప్రేమ, భావోద్వేగాలు, మ్యాజిక్ వల్లే తనకు నటి కావాలనే బలమైన కోరిక కలిగిందని పంచుకుంది. లెజెండరీ ఫిల్మ్‌మేకర్ సూరజ్ బార్జాత్యా దర్శకత్వంలో చేయడం తన చిన్ననాటి కల నెరవేరినట్లుగా అనిపిస్తుందని శార్వరి చెప్పుకొచ్చింది. ఇక ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ ఏడాది నవంబర్ 27న థియేటర్స్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# శ్రీచరణి.. 817



భారత యువ స్పిన్నర్ శ్రీ చరణి ఐసీసీ మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. కెరీర్‌లోనే అత్యుత్తమంగా 817 రేటింగ్ పాయింట్లకు చేరుకుంది. దీంతో 2018 నవంబర్‌లో ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ షట్ సాధించిన 806 పాయింట్ల రికార్డును అధిగమించింది. మహిళల టీ20 క్రికెట్లో మరే బౌలర్ ఇప్పటివరకు ఈ స్థాయిలో రేటింగ్ అందుకోలేదు. ఇప్పటికే టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్‌గా ఉన్న చరణి.. ఇప్పుడు ఆ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో చరణి అద్భుతంగా రాణించింది. జపాన్‌పై 4/10తో కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేసింది. అనంతరం శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టింది. ఈ మ్యాచ్‌లో భారత్ 147 పరుగుల తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఆసియా కప్‌లోనూ చరణి కీలక పాత్ర పోషించింది. టోర్నీలో 12 వికెట్లు తీసుకుంది. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 4/20తో అదరగొట్టింది. దీంతో భారత్ 72 పరుగుల తేడాతో విజయం సాధించి ఎనిమిదోసారి ఆసియా కప్ టైటిల్ దక్కించుకుంది. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత మరో స్టార్ దీప్తి శర్మ కూడా ముందుకు వచ్చింది. ఆసియా క్రీడల ఫైనల్లో మూడు వికెట్లు తీసుకున్న ఆమె 754 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎక్లెస్టోన్ 723 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన కూడా టాప్–5లోకి తిరిగి వచ్చింది. ఆసియా క్రీడల ఫైనల్లో శ్రీలంకపై 79 పరుగులు చేయడంతో ఆమెకు ఈ స్థానం దక్కింది.



# మా దారులు వేరు.. లక్ష్యం ఒక్కటే: రోహిత్ శర్మ

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లితో తనకున్న అనుబంధంపై మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ ఇద్దరి మధ్య ఎంతో బలమైన స్నేహబంధం ఉందని, అది తమ అంతర్జాతీయ కెరీర్ ఆరంభం నుంచే కొనసాగుతోందని స్పష్టం చేశాడు. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ముందు ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడుతూ, తమ మధ్య ఉన్న బంధం గురించి రోహిత్ శర్మ మాట్లాడాడు. తమ మధ్య స్నేహం ఆస్ట్రేలియా పర్యటన సమయంలో మొదలైందని రోహిత్ గుర్తుచేసుకున్నాడు. "ఆ సమయం నుంచి మేమిద్దరం కలిసే ఉన్నాం. దానికి సంబంధించిన పాత వీడియోలు టీవీలో వచ్చినప్పుడు మేమిద్దరం ఒకరినొకరు చూసుకుని నవ్వుకుంటాం. అది చాలా సరదాగా ఉంటుంది. అభిమానులు మమ్మల్ని 'రో–కో' అని పిలుస్తుంటారు. ప్రజలకు కొంత మసాలా కావాలి కదా, ఇదిగో మసాలా" అంటూ రోహిత్ నవ్వుతూ వ్యాఖ్యానించాడు. రోహిత్ 2007లో, కోహ్లి 2008లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టారు. దాదాపు ఒకే సమయంలో కెరీర్ ప్రారంభించిన తామిద్దరం అప్పటి నుంచి జట్టుకు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నిస్తున్నామని రోహిత్ చెప్పాడు. "మా ఇద్దరి మధ్య బలమైన స్నేహబంధం ఉంది. ఈ స్థాయిలో ఆడుతున్నప్పుడు ఏం అవసరమో మాకు బాగా తెలుసు" అని వివరించాడు. ఆట పరంగా తమ ఇద్దరి పద్ధతులు వేరైనా, జట్టును గెలిపించాలనే ఉమ్మడి లక్ష్యం మాత్రం ఒక్కటేనని రోహిత్ స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా అయినా, సాధారణ ఆటగాడిగా అయినా కోహ్లి ఎప్పుడూ తన ఆటపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి, పరుగులు సాధించి జట్టు విజయానికి దోహదపడతాడని ప్రశంసించాడు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలోనూ తమ ఆటను ఎలా మెరుగుపరుచుకోవాలనే దానిపై తరచూ చర్చించుకుంటామని, ఆచరణాత్మక విషయాలు మాట్లాడుకుంటామని రోహిత్ శర్మ తెలిపాడు.

ఏషియన్ గేమ్స్ 2026



# ట్రాప్ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం

ఏషియన్ గేమ్స్ 2026లో భారత్ మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల ట్రాప్ షూటింగ్‌లో నీరు ధండా స్వర్ణ పతకాన్ని గెలిచింది. దీంతో వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నీరు చరిత్ర సృష్టించింది. వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్ ఫైనల్స్‌లో మొత్తం 8మంది పోటీపడగా నీరు 28 పాయింట్ల స్కోర్ సాధించి, 24 పాయింట్ల పాత ఏషియన్ గేమ్స్ రికార్డును కూడా బద్దలు కొట్టింది. దీంతో ఆమె 26 పాయింట్లతో ముగించిన చైనా క్రీడాకారిణి యునాంగ్ సన్‌ను అధిగమించింది. ఇక నేటితో ఏషియన్ గేమ్స్ ప్రారంభమై 11రోజులు కాగా నేడు సర్ఫింగ్, ఆర్చరీ, కురాష్, ట్రాక్ సైక్లింగ్, షూటింగ్, స్క్వాష్, కానో స్లాలోమ్, సెయిలింగ్, టెన్నిస్, బాక్సింగ్ ఇతర క్రీడల్లో భారత క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇక నిన్న వివిధ విభాగాల్లో దేశానికి ఏకంగా ఎనిమిది పతకాలు వచ్చాయి కానీ గోల్డ్ దక్కలేదు. నిన్న జరిగిన పోటీల్లో నాలుగు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు వచ్చాయి.



# మహిళల ట్రాప్ టీమ్‌లో భారత్‌కు రజతం

ఏషియన్ గేమ్స్ 2026లో షూటింగ్ విభాగంలో భారత్‌కు మరో పతకం లభించింది. మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో నీరూ ధాండా, ఆశిమా అహ్లావత్, మనీషా కీర్‌తో కూడిన భారత బృందం 328 పాయింట్లతో రజత పతకం సాధించింది.

**భారత షూటర్ల ప్రదర్శన**

భారత్ తరఫున నీరూ ధాండా 118 పాయింట్లు, ఆశిమా అహ్లావత్ 106 పాయింట్లు, మనీషా కీర్ 104 పాయింట్లు సాధించారు. ఈ ముగ్గురి స్కోర్లు కలిపి భారత్ ఖాతాలో 328 పాయింట్లు నమోదయ్యాయి.

నీరూ ధాండా భారత జట్టు ప్రదర్శనలో కీలకంగా నిలిచారు. వ్యక్తిగత అర్హత రౌండ్‌లో ఆమె 125కి 118 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ఈ ప్రదర్శనతో ఆమె వ్యక్తిగత ట్రాప్ ఫైనల్‌కు కూడా అర్హత సాధించారు.

చైనా బృందం 346 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా, కువైట్ 325 పాయింట్లతో కాంస్యం సాధించింది. భారత్ కువైట్‌పై 3 పాయింట్ల ఆధిక్యంతో రజతాన్ని దక్కించుకుంది.

**నీరూ ధాండాకు మరో అవకాశం**

టీమ్ రజతంతో సరిపెట్టకుండా నీరూ ధాండా వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లోనూ ఫైనల్‌కు చేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అర్హత రౌండ్‌లో 118 పాయింట్లతో ఆమె సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. ఆశిమా 16వ స్థానంలో, మనీషా 23వ స్థానంలో నిలిచారు.

మనీషా కీర్‌కు ఇది మరో ముఖ్యమైన ఏషియన్ గేమ్స్ పతకం. 2023 హాంగ్‌జౌ ఏషియన్ గేమ్స్‌లోనూ మహిళల ట్రాప్ టీమ్‌లో ఆమె రజతం సాధించిన భారత బృందంలో సభ్యురాలిగా ఉన్నారు.

# హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్‌కు రజతం

ఒకవైపు భుజం నొప్పి ఇబ్బందిపెడుతోంది.. మరోవైపు అలసట నరనరాన్నీ వేధిస్తోంది.. ఇంకోవైపు గుండె ఆగిపోయేంత ఒత్తిడిని పెంచుతూ పోటీ సాగుతోంది.! కానీ, ఏ క్షణంలోనూ ఆమె చూపు






లక్ష్యం నుంచి పక్కకు మరలలేదు. ఒత్తిడి సుడిగుండంలోనూ గురి తప్పని అసాధారణ పోరాటస్ఫూర్తితో తెలంగాణ బిడ్డ, భారత స్టార్ షూటర్ ఇషా సింగ్ ఆసియా క్రీడల్లో సంచలనం సృష్టించింది. ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన మను భాకర్.. వెటరన్ షూటర్ రాహీ సర్నోబత్ కనీసం ఫైనల్ కూడా చేరలేకపోయిన వేళ.. ప్రపంచ నంబర్ వన్ హోదాలో రేంజ్‌లోకి అడుగుపెట్టిన 21 ఏండ్ల ఇషా ప్రతిభకు మాత్రమే కాకుండా ఓర్పు, సహనానికి పరీక్షగా నిలిచిన మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో రజత పతకం సాధించింది. అథ్లెటిక్స్‌లో గుల్వీర్ సింగ్, యశ్‌వీర్ సింగ్, శ్రీశంకర్ కూడా సిల్వర్ మెడల్స్ గెలిచినా .. సోమవారం మొత్తంగా వచ్చిన 'అష్ట'పతకాల్లో మన ఇషా తెచ్చిన వెండే అత్యంత ప్రకాశవంతంగా మెరిసింది.

# కుల్దీప్ ఛాంపియన్ స్పిన్నర్

వన్డే ప్రపంచకప్ కోసం స్క్వాడ్ ఎంపిక ఆసక్తి రేపుతోంది. సన్నాహక సిరీస్‌లో అదరగొట్టిన ఆటగాళ్లకే మెగా టోర్నీలో అవకాశం లభించనుంది.



బ్యాటింగ్ యూనిట్‌పై కాసింత స్పష్టత వచ్చినా.. స్పిన్ దళంలో ఎవరు ఉంటారు? అనేది చర్చనీయాంశంగా మారంది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌పై తొలి వన్డేలో సునాయస విజయం అనంతరం మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది వన్డే వరల్డ్‌కప్ బృందంలో కుల్దీప్ యాదవ్ ను కచ్చితంగా తీసుకోవాలని బీసీసీఐకి సూచించాడీ స్పిన్ దిగ్గజం. ఉపఖండంలోనే కాదు విదేశాల్లోనూ జట్టు విజయాల్లో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తుంటారు. రాబోయే వన్డే ప్రపంచకప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వేలోనూ వికెట్ స్పిన్‌కు అనుకూలించే అవకాశముంది.



# కింగ్‌ను ఎవరూ తాకలేరు: కైఫ్

'ఆస్ట్రేలియాలో డకౌట్ అయితే రిటైర్ అవ్వమన్నారు. కానీ ఆ తర్వాత అతడు ఏం చేశాడో చూశారా? 11 ఇన్నింగ్స్‌లు, 900 పరుగులు, నాలుగు సెంచరీలు! ఈ రోజు 9 సిక్సర్లతో తనలోని కొత్త కోణాన్ని చూపించాడు. 37 ఏళ్ల వయసులోనూ అతడి బ్యాట్ మాట్లాడుతోంది. గుర్తుపెట్టుకోండి, బ్యాట్ మాట్లాడుతున్నంత వరకు అతన్ని ఎవరూ తాకలేరు!' అని మహమ్మద్ కైఫ్ అన్నాడు. కొంతకాలంగా కోహ్లి ఫామ్‌పై, అతడి భవిష్యత్తుపై ఎన్నో అనుమానాలు, విమర్శలు. ముఖ్యంగా వయసు పైబడటంతో మునపటి పదును లేదన్న వ్యాఖ్యలు వినిపించాయి. కానీ, వాటన్నిటినీ పటాపంచలు చేస్తూ, "నేనింకా ఇక్కడే ఉన్నాను.. కింగ్ ఈజ్ ఆల్వేజ్ కింగ్" అని చాటిచెప్పాడు. కైఫ్ అన్నట్లు, ఆస్ట్రేలియా పర్యటనలో వైఫల్యం తర్వాత కోహ్లి తన ఆటను మరో స్థాయికి తీసుకెళ్లాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతడు కొట్టిన 9 సిక్సర్లు, అతడ ఫిట్‌నెస్, దూకుడుకు నిదర్శనం. మొత్తం మీద, ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో కోహ్లి తనపై వస్తున్న విమర్శలన్నిటికీ బ్యాట్‌తోనే సమాధానమిచ్చాడు. 2027 ప్రపంచకప్ వరకూ ఆడతానని ప్రకటించిన విరాట్.. తన లక్ష్యం దిశగా ఎంత బలంగా ఉన్నాడో ఈ మ్యాచ్ ద్వారా ప్రపంచానికి చూపించాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే సెప్టెంబర్ 30న గువాహటిలో జరగనుంది.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

## ‘సర్’పై లొల్లి సరే.. సమస్యలపై చర్చేది?

ఎన్నికలు సమీపిస్తే రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం సహజమే. ఇప్పుడు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ.. ఎస్ఐఆర్ కూడా రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ పేరుతో గగ్గోలు పెడుతున్నాయి. అధికార పక్షం మాత్రం ఓటరు జాబితాల శుద్ధీకరణ అవసరమని చెబుతోంది. ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. నిరసనలు.. రాజకీయ విమర్శలు సాగుతున్నాయి. కానీ ఈ మొత్తం వ్యవహారంలో అసలు సమస్య ఏమిటన్నదే పక్కకు వెళ్లిపోతోంది. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది. అందులో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఉండాలి. అనర్హుల పేర్లు ఉండకూడదు. ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల ఉండకూడదు. మరణించిన వారి పేర్లు కొనసాగకూడదు. శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలు సరిచేయాలి. ఎన్నికల సంఘం కూడా ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశ్యం అర్హులైన పౌరులు ఎవరూ జాబితా నుంచి తప్పిపోకుండా, అనర్హులు జాబితాలో చేరకుండా చూడటమేనని స్పష్టం చేస్తోంది. అయితే ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. ఓటరు జాబితా శుద్ధీకరణ అవసరమైతే.. ఆ ప్రక్రియ ఎలా జరగాలి? అర్హుడైన ఓటరు పేరు తొలగిపోకుండా ఎలాంటి రక్షణలు ఉండాలి? ఒక సాధారణ పౌరుడు తన పేరు జాబితాలో లేదని గుర్తిస్తే దాన్ని తిరిగి చేర్చుకునే విధానం ఎంత సులభంగా ఉండాలి? పేదలు, వృద్ధులు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు, దూర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రక్రియ అందుబాటులో ఉందా? ఇవే అసలు ప్రశ్నలు. రాజకీయ పార్టీలు ఈ అంశాలపై సమగ్రంగా చర్చించాలి. కేవలం ‘ఎస్ఐఆర్ వద్దు’ అనడం వల్ల సమస్య పరిష్కారం కాదు. అలాగే ‘ఎస్ఐఆర్ జరుగుతోంది కాబట్టి అంతా సవ్యంగానే ఉంది’ అనడం కూడా సరిపోదు. ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యల్లో పారదర్శకత ఎంత? ముసాయిదా జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కారణాలు ప్రజలకు స్పష్టంగా తెలుస్తున్నాయా? అభ్యంతరాలు, దావాలు స్వీకరించే వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుందా? తుది జాబితా రూపొందించే ముందు ప్రతి అభ్యంతరాన్ని నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నారా? ఇవన్నీ ప్రజలకు తెలియాల్సిన విషయాలు. ఇప్పటికే ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ కోసం పేర్లను శోధించేందుకు, ఓటరు జాబితాలను పరిశీలించేందుకు, నోటీసులకు సంబంధించిన పత్రాలను సమర్పించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ సదుపాయాలను అందుబాటులో ఉంచింది. కానీ డిజిటల్ సదుపాయం అందుబాటులో ఉండటం ఒక్కటే సరిపోదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు, సాంకేతిక పరిజ్ఞానం తెలియని వృద్ధులు, వలస జీవనం సాగించే కార్మికులు కూడా ఈ ప్రక్రియలో సమానంగా భాగస్వాములు కావాలి. ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం కంటే అసలు పై సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావాలి.




# 18 ప్లస్‌కే సోషల్ మీడియా..
# చర్చ జరగాల్సిందే

స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచం అరచేతిలోకి వచ్చినట్టే. కానీ అదే ఫోన్ చిన్నారుల చేతుల్లోకి వెళ్లినప్పుడు ఆ ప్రపంచం ఎంతవరకు సురక్షితం? సామాజిక మాధ్యమాల వినియోగానికి కనీస వయసును 18 ఏళ్లకు పెంచాలన్న చర్చ ఇప్పుడు కొత్త ప్రశ్నలను ముందుకు తెస్తోంది. పిల్లలను ప్రమాదాల నుంచి కాపాడాలన్న ఉద్దేశం ఒకవైపు ఉంటే.. వారి సమాచార హక్కు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, డిజిటల్ ప్రపంచంతో పరిచయం వంటి అంశాలు మరోవైపు ఉన్నాయి.

సామాజిక మాధ్యమాలు పిల్లలకు కేవలం వినోద వేదికలు కావు. విద్య, సమాచారం, సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచంతో అనుసంధానం వంటి అవకాశాలను కూడా అవి కల్పిస్తున్నాయి. అదే సమయంలో తప్పుడు సమాచారం, సైబర్ వేధింపులు, మోసాలు, అనుచిత కంటెంట్, అపరిచితులతో పరిచయాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి ముప్పులు కూడా ఉన్నాయి. గంటల తరబడి తెరను చూస్తూ ఉండటం వల్ల చదువు, నిద్ర, ప్రత్యక్ష సామాజిక సంబంధాలపై ప్రభావం పడే అవకాశం కూడా ఉంది. అయితే 18 ఏళ్ల వయసు వచ్చేవరకు పూర్తిగా సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచడమే పరిష్కారమా? అన్నది ఆలోచించాల్సిన ప్రశ్న. వయసు పరిమితి పెట్టడం సులభం. కానీ దాన్ని అమలు చేయడం అంత సులభం కాదు. వయసు నిర్ధారణ ఎలా జరుగుతుంది? పిల్లలు తప్పుడు వయసుతో ఖాతాలు తెరిస్తే? తల్లిదండ్రుల పేరుతో ఖాతాలు ఉపయోగిస్తే? పాఠశాలలు, విద్యాసంస్థల డిజిటల్ అవసరాల సంగతేంటి? ఇవన్నీ స్పష్టమైన సమాధానాలు కోరుతున్నాయి. మరో ముఖ్యమైన విషయం.. బాధ్యత మొత్తం పిల్లలపై లేదా తల్లిదండ్రులపై వేయడం సరైంది కాదు. సామాజిక మాధ్యమ వేదికలు కూడా తమ బాధ్యతను స్వీకరించాలి. పిల్లల డేటాను ఎలా సేకరిస్తున్నాయి? వారికి ఎలాంటి కంటెంట్‌ను సిఫారసు చేస్తున్నాయి? వ్యసనపూరిత వినియోగాన్ని పెంచే రూపకల్పనలను ఎంతవరకు నియంత్రిస్తున్నాయి? ఫిర్యాదులపై ఎంత వేగంగా స్పందిస్తున్నాయి? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఉండాలి. 18 ఏళ్ల పరిమితి అనే ఒక్క సంఖ్యతో సమస్య పరిష్కారం కాదు. వయసు ధ్రువీకరణతో పాటు బాలల గోప్యత రక్షణ, తల్లిదండ్రుల పర్యవేక్షణ, పాఠశాలల్లో డిజిటల్ అవగాహన, సామాజిక మాధ్యమ సంస్థల జవాబుదారీతనం, పిల్లలకు తగిన భద్రతా వ్యవస్థలు అవసరం. పిల్లలను డిజిటల్ ప్రపంచం నుంచి పూర్తిగా వేరు చేయడం కంటే.. ఆ ప్రపంచంలో సురక్షితంగా ఎలా ఉండాలో నేర్పడం కూడా అంతే ముఖ్యం. నీటిలో మునిగిపోతారని ఈత నేర్పకుండా ఉండటం పరిష్కారం కాదు. ఈత నేర్పి, ప్రమాదాలను గుర్తించేలా చేయాలి. డిజిటల్ ప్రపంచానికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అందుకే 18 ప్లస్‌కే సామాజిక మాధ్యమాలు అన్న ప్రతిపాదనపై భావోద్వేగంతో కాకుండా ఆధారాలు, అనుభవాలు, పిల్లల హక్కులు, భద్రత, సాంకేతిక సాధ్యాసాధ్యాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని విస్తృత చర్చ జరగాలి. పిల్లలను కాపాడటం లక్ష్యమైతే.. నిషేధం ఒక్కటే మార్గమా, లేక బాధ్యతాయుతమైన డిజిటల్ సంస్కృతిని నిర్మించడమా? అన్నదే అసలు చర్చ కావాలి.

**- శ్రీకాంత్ చుక్కల, నిజామాబాద్**




# అనువాదం..
# భాష సజీవం

ఒక భాషలోని భావాన్ని మరో భాషలోకి తీసుకెళ్లడం కేవలం పదాల మార్పిడి కాదు. ఒక సంస్కృతిని మరో సంస్కృతికి పరిచయం చేయడం.. ఒక ఆలోచనను మరో సమాజానికి చేరవేయడం.. ఒక ప్రాంతపు అనుభవాలను ప్రపంచంతో పంచుకోవడం. అందుకే అనువాదం భాషల మధ్య వారధి మాత్రమే కాదు.. మానవ సమాజాల మధ్య అనుసంధాన కర్త కూడా.

**సంస్కృతంలో ‘అనువాదం’ అంటే పునఃకథనం లేదా ఒకరు చెప్పిన విషయాన్ని మరొకరు చెప్పడం అనే అర్థం ఉంది. ఆధునిక కాలంలో ఒక భాషలో వ్యక్తమైన భావాలు, ఆలోచనలు, సాహిత్యం, విజ్ఞానం, చట్టాలు, సమాచారాన్ని మరో భాషలోకి అందుబాటులోకి తీసుకురావడాన్ని అనువాదంగా పిలుస్తున్నాం.**




ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 30న అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని నిర్వహిస్తారు. బైబిల్‌ను లాటిన్, హిబ్రూ, గ్రీకు భాషల మధ్య అనువదించిన సెయింట్ జెరోమ్ స్మారకంగా ఈ తేదీని ఎంచుకున్నారు. ఆయన సెప్టెంబర్ 30, 420న మరణించారు. ప్రపంచవ్యాప్తంగా అనువాదకుల ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ అంతర్జాతీయ అనువాదకుల సమాఖ్య 1991లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అనంతరం 2017 మే 24న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సెప్టెంబర్ 30ను అంతర్జాతీయ అనువాద దినోత్సవంగా అధికారికంగా గుర్తించింది. ప్రపంచంలో వేలాది భాషలు మాట్లాడబడుతున్నాయి. ఒక్కో భాష ఒక ప్రత్యేక చరిత్రను, సంస్కృతిని, జీవన విధానాన్ని, సామాజిక అనుభవాన్ని తనలో దాచుకుని ఉంటుంది. అయితే భాషా వైవిధ్యమే కొన్ని సందర్భాల్లో పరస్పర అవగాహనకు అడ్డంకిగా మారుతుంది. ఆ అడ్డంకిని అధిగమించడంలో అనువాదకులు, వ్యాఖ్యాతలు కీలక పాత్ర పోషిస్తున్నారు. అనువాదం, వ్యాఖ్యానం రెండూ ఒకేలా కనిపించినా వాటి విధానం వేరు. రాతపూర్వక విషయాన్ని ఒక భాష నుంచి మరో భాషలోకి మార్చడం అనువాదం. మాట్లాడే విషయాన్ని మరో భాషలో తక్షణం అర్థమయ్యేలా చెప్పడం వ్యాఖ్యానం. రెండింటికీ భాషపై పట్టు మాత్రమే కాకుండా.. సందర్భం, సంస్కృతి, స్థానిక భావజాలంపై అవగాహన అవసరం. నేటి ప్రపంచంలో అనువాదం ప్రాధాన్యం మరింత పెరిగింది. అంతర్జాలం ప్రపంచాన్ని దగ్గర చేసిన నేపథ్యంలో దేశాల మధ్య వ్యాపారం, విద్య, వైద్యం, విజ్ఞానం, సాంకేతికత, న్యాయ వ్యవస్థ, దౌత్య సంబంధాలు, మీడియా రంగాల్లో భాషల మధ్య వారధి అవసరం పెరిగింది. ఒక దేశంలో రూపొందిన విజ్ఞానం మరో దేశానికి చేరాలన్నా.. ఒక సమాజపు సాహిత్యం మరో సమాజం చదవాలన్నా.. అనువాదమే ప్రధాన సాధనం. ముఖ్యంగా సాహిత్య రంగంలో అనువాదం చేసిన సేవ అపారమైనది. ప్రపంచంలోని గొప్ప రచనలు అనువాదాల ద్వారా వివిధ భాషల పాఠకులకు చేరాయి. బెంగాలీ రచయిత శరత్‌చంద్ర ఛటర్జీ రచించిన ‘దేవదాసు’ను తెలుగులోకి అనువదించిన చక్రపాణి, తెలుగు పాఠకుల హృదయాలకు దగ్గరయ్యేలా ఆ రచనను మలిచారు. హిందీ రచయిత భీష్మ సహనీ రచించిన ‘తమస్’ను యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలుగులోకి అనువదించారు. మక్సిమ్ గోర్కీ ‘మదర్’ నవల కూడా పలుమార్లు తెలుగులోకి వచ్చింది. క్రొవ్విడి లింగరాజు చేసిన అనువాదం తెలుగు పాఠకులను విశేషంగా ఆకట్టుకుంది. జనరల్ లూ వాలెస్ రచించిన ‘బెన్‌హర్’ను మాడభూషి కృష్ణప్రసాద్ తెలుగులోకి తీసుకొచ్చారు. టాల్‌స్టాయ్ ‘అన్నా కరేనీనా’కు తాపీ ధర్మారావు చేసిన తెలుగు అనువాదం కూడా ప్రస్తావించదగినదే. ఇలా ప్రపంచ సాహిత్యంలోని అనేక గొప్ప రచనలు తెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో తెలుగు నుంచి ఇతర భాషల్లోకి వెళ్లిన రచనల సంఖ్యతో పోలిస్తే ఇంకా విస్తరించాల్సిన అవసరం ఉంది. మన భాషలోని సాహిత్య సంపద, తెలంగాణ--ఆంధ్ర ప్రాంతాల జీవన అనుభవాలు, జానపద సంస్కృతి, సామాజిక చరిత్ర, స్థానిక కథనాలు ఇతర భాషల పాఠకులకు మరింతగా చేరాలి. అనువాదంలో రెండు ప్రధాన ధోరణులు కనిపిస్తాయి. మూల రచనలోని భావాన్ని, నిర్మాణాన్ని సాధ్యమైనంత వరకు యథాతథంగా మరో భాషలోకి తీసుకురావడం ఒక పద్ధతి. మూల రచన సారాన్ని, భావోద్వేగాన్ని కాపాడుతూ లక్ష్య భాషలో సహజంగా అందించడం మరో పద్ధతి. ఏ పద్ధతిని అనుసరించినా మూల రచయిత ఆలోచనకు న్యాయం చేయడం, పాఠకుడికి సహజమైన అనుభూతిని కలిగించడం అనువాదకుడి ముందున్న ప్రధాన బాధ్యత. ఇప్పటి సాంకేతిక యుగంలో యాంత్రిక అనువాద సాధనాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అయినప్పటికీ భాషలోని నుడికారం, సామెత, స్థానికత, సంస్కృతిక సందర్భం, భావోద్వేగం వంటి అంశాలను పూర్తిగా అందిపుచ్చుకోవడంలో మానవ అనువాదకుడి పాత్ర ఇంకా కీలకమే. ముఖ్యంగా అంతరించిపోతున్న భాషలు, అట్టడుగు వర్గాల మౌఖిక సంప్రదాయాలు, స్థానిక జ్ఞానాన్ని భద్రపరచడంలో అనువాదం ఒక ముఖ్యమైన సాధనంగా నిలుస్తోంది. తెలుగు మాధ్యమ విద్య క్రమంగా తగ్గిపోతున్న సమయంలోనూ, స్వభాషపై నిర్లక్ష్యం పెరుగుతున్న పరిస్థితుల్లోనూ అనువాద సాహిత్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రపంచ సాహిత్యం తెలుగులోకి రావాలి. తెలుగు సాహిత్యం ప్రపంచ భాషల్లోకి వెళ్లాలి. ఇతర భాషల జ్ఞానం మనకు అందాలి. మన భాషలోని జ్ఞాన సంపద ప్రపంచానికి చేరాలి. భాషలు కేవలం సంభాషణ సాధనాలు కావు. అవి ఒక జాతి జ్ఞాపకాలు, సంస్కృతి, చరిత్ర, ఆత్మగౌరవానికి ప్రతీకలు. ఆ భాషల మధ్య వారధిగా నిలిచే అనువాదం.. భాషలను మాత్రమే కాదు, తరాలను, సంస్కృతులను, సమాజాలను కలుపుతుంది.



**- రామకిష్టయ్య సంగన భట్ల**
**ఫోన్ నంబర్: 9440595494**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMARfrom H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004